

అమరావతి అభివృద్ధితో పెట్టుబడులు, ఉద్యోగావకాశాలు పెరుగుతాయి. హైదరాబాద్ లాంటి నగరంగా మారే అవకాశం ఉంది. చంద్రబాబు ఆర్థిక స్థిరత్వం కోసం కృషి చేస్తున్నారు. జగన్ చేసిన అప్పులు క్రమంగా తీర్చుతున్నారు. రూ.4000 పింఛన్ ఇస్తున్న రాష్ట్రం మనదే.

**ఆలపాటి రాజేంద్రప్రసాద్, ఎమ్మెల్సీ**


శనివారం 17.05.2025

INK OF TRUTH

# జర్నలిస్ట్ ఫైల్

తెలుగు దినపత్రిక

సంపుటి - 33 సంచిక -47 www.journalistfile.com పేజీలు 8 వెల : రూ.5.00


# ఉప్పొంగిన దేశభక్తి

- తిరంగా యాత్ర ర్యాలీకి పోటెత్తిన ప్రజలు
- ఇందిరాగాంధీ మున్సిపల్ స్టేడియం నుండి ప్రారంభమైన యాత్ర
- బెంజ్ సర్కిల్ వరకు సాగిన యాత్ర
- యువత, మాజీ సైనికులు, విద్యార్థులు, ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొని మద్దతు
- కిక్కిరిసిన బందర్ రోడ్డు
- భారత్‌పైకి ఉగ్రవాదులు కన్నెత్తి చూడకుండా సైన్యం జవాబిచ్చింది
- మనదేశ బలం, బలగం సాయుధ దళాలే
- ఉగ్రవాదంపై ప్రధాని మోదీ రాజీలేని పోరాటం
- సీఎం చంద్రబాబు నాయుడు

**విజయవాడ (జర్నలిస్ట్ ఫైల్):** పహల్గాం లో ఉగ్రదాడులకు ప్రతిగా దేశ ప్రధాని మోదీ చేపట్టిన ఆపరేషన్ సింధూర్ విజయవంతం కావడం, శత్రుదేశం తోక ముడవడంతో మన సత్తా ప్రపంచానికి చాటి చెప్పడంతో దేశ ప్రజలు చేపట్టిన దేశవ్యాప్త తిరంగ యాత్ర కు మద్దతుగా శుక్రవారం తిరంగా యాత్ర ర్యాలీని విజయవాడ నడిబొడ్డున బందర్ రోడ్ లో నిర్వహించారు. ఈ తిరంగా యాత్రకు ప్రజలు, యువత, మాజీ సైనికులు, విద్యార్థులు చేతుల్లో జాతీయ జండాలను చేపట్టి పెద్ద సంఖ్యలో హాజరుకావడం వారిలోని దేశభక్తికి నిదర్శనంగా నిలుస్తుంది. తిరంగా యాత్ర ర్యాలీలో మన రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్, బీజేపీ జాతీయ నాయకురాలు పురందేశ్వరి, మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎంపీలు పెద్ద సంఖ్యలో పాల్గొని జాతినుద్దేశించి ప్రసంగించారు.

నగరంలోని ఇందిరాగాంధీ మున్సిపల్ స్టేడియం నుండి తిరంగా యాత్ర ప్రారంభమైంది. బందర్ రోడ్ లోని పీవీపీ మాల్, వివంతా హోటల్ ల మీదుగా బెంజ్ సర్కిల్ కు చేరుకుంది. తిరంగా యాత్రకు మద్దతుగా సీఎం చంద్రబాబు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ లు జాతీయ జండాలు చేతబూని ముందుండి ర్యాలీని నడిపించారు. తిరంగా యాత్ర ర్యాలీకి వేల సంఖ్యలో ప్రజలు హాజరై శత్రుదేశం దుచ్చర్యలపై మన దేశం ప్రతికారం తీర్చుకోవడంపై ప్రత్యక్షంగా మద్దతు తెలిపారు. మన దేశం ఒకరి జోలికి వెళ్లదు.. ఎవరైనా మన దేశం జోలికి వస్తే చావుదెబ్బ కొడతామని ప్రపంచానికి చాటినట్లయిందని యువత తమ అభిప్రాయాలు వ్యక్తం చేశారు. ర్యాలీ లో భారత మాతకు జై అంటూ నినాదాలు మిన్నంటాయి.

బెంజ్ సర్కిల్ లో సీఎం చంద్రబాబు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్, పురందేశ్వరీలు ప్రజలనుద్దేశించి ప్రసంగించారు. మన రాష్ట్రానికి చెందిన మురళీనాయక్ అనే సైనికుడు దేశం కోసం ప్రాణాలను సైతం ఫణంగా పెట్టడం ప్రతి ఒక్కరూ ఆదర్శంగా తీసుకోవాలని నాయకులు పిలుపునిచ్చారు.

ముందుగా ఇందిరాగాంధీ మున్సిపల్ స్టేడియం వద్ద ఏర్పాటు చేసిన వేదికపై దేశ సౌభ్రాతృత్వాన్ని, సార్వభౌమత్వం చాటి చెప్పే విధంగా దేశభక్తి గీతాలాపన, సాంస్కృతిక కార్యక్రమాలను విద్యార్థులు ప్రదర్శించారు. దేశభక్తి గీతాలు వీక్షకులను ఉర్రూతలూగించాయి.

మహిళల నుదుట సింధూరాన్ని తుడిచిన ఉగ్రవాదులకు ఆపరేషన్ సిందూర్ తో ధీటుగా బదులిచ్చామని ఏపీ సీఎం చంద్రబాబు అన్నారు. భారత్ పై తమ ఆటలు సాగవని పాకిస్తాన్ గ్రహించాలని, మన దేశంపై దాడి చేస్తే అదే వారికి చివరి రోజు అవుతుందన్నారు. ఉగ్రవాదంపై అలుపెరుగని పోరాటం చేస్తున్న సైనికులకు సెల్యూట్ చేస్తున్నానన్నారు. మోదీ రూపంలో దేశానికి సమర్థవంతమైన నాయకుడు లభించాడని,



• వివరాలు 2 లో

## దివ్యాంగులకు.. గుర్తింపు కార్డులు



- మనమిత్ర వాట్సాప్ గవర్నెన్స్ తో సదరం స్లాట్ బుకింగ్
- స్లాట్ బుకింగ్ రోజు నుంచి నెల రోజుల్లో సదరం సర్టిఫికెట్లు
- 70 ఏళ్లు దాటిన ప్రతి ఒక్కరికీ పీఎంజేపీవై వందన స్కీమ్ ద్వారా రూ.5 లక్షల ఉచిత వైద్యం
- మంత్రి డా.డోలా శ్రీ బాల వీరాంజనేయ స్వామి
- అధికారులతో మంత్రి డోలా సమీక్ష

**అమరావతి, (జర్నలిస్ట్ ఫైల్):** దివ్యాంగులకు గుర్తింపు కార్డులు అందజేసేందుకు కేంద్ర ప్రభుత్వం చర్యలు చేపట్టిందని అందులో భాగంగా రాష్ట్రంలో దివ్యాంగులకు గుర్తింపు కార్డుల జారీకి అవసరమైన చర్యలు చేపట్టాలని రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి డా. డోలా బాల వీరాంజనేయస్వామి అధికారులను ఆదేశించారు.

మిగతా2 లో..

## ఏపీ క్లీన్ ఎనర్జీలో ట్రెండ్ సెట్

- ఇతరులు పాలసీలు చూసిన చోట ఆయన అవకాశాలు చూశారు: మంత్రి నారా లోకేశ్
- అనంతపురం జిల్లాలో రెన్యూ పవర్ భారీ ప్రాజెక్టుకు భూమిపూజ
- రూ.22 వేల కోట్ల వ్యయంతో ఇంటిగ్రేటెడ్ ఎనర్జీ కాంప్లెక్స్ నిర్మాణం
- మంత్రి నారా లోకేశ్ చేతుల మీదుగా శంకుస్థాపన కార్యక్రమం
- ఈ ప్రాజెక్టు ద్వారా సుమారు 10 వేల మందికి ఉపాధి అవకాశాలు
- ఏపీని క్లీన్ ఎనర్జీ హబ్‌గా మార్చడమే ప్రభుత్వ లక్ష్యమని వెల్లడి




**అనంతపురం ( జర్నలిస్ట్ ఫైల్ ):** ఆంధ్రప్రదేశ్‌ను పునరుత్పాదక ఇంధన రంగంలో అగ్రగామిగా నిలపాలన్న లక్ష్యంతో ప్రభుత్వం కీలక అడుగులు వేస్తోంది. ఇందులో భాగంగా, అనంతపురం జిల్లా, గుంతకల్లు నియోజకవర్గం, బేతపల్లి గ్రామంలో రెన్యూ పవర్ సంస్థ ఏర్పాటు చేయనున్న రూ. 22 వేల కోట్ల విలువైన భారీ హైబ్రిడ్ ఇంటిగ్రేటెడ్ ప్రాజెక్టుకు రాష్ట్ర ఐటీ, విద్యా శాఖల మంత్రి నారా లోకేశ్ నేడు భూమిపూజ చేశారు. ఈ ప్రాజెక్టు ద్వారా రాష్ట్రంలో పారిశ్రామిక ప్రగతితో పాటు వేలాది మంది యువతకు ఉపాధి అవకాశాలు లభించనున్నాయి.

ఈ సందర్భంగా జరిగిన సభలో మంత్రి నారా లోకేశ్ మాట్లాడుతూ, "రెన్యూ పవర్ ప్రాజెక్టుకు మనం వేస్తున్న పునాదిరాయి, భారతదేశ క్లీన్ ఎనర్జీ విప్లవానికి పునాదిరాయి వంటిది.

మిగతా2 లో..

## లిక్కర్‌స్కాం.. అరెస్టుల పర్వం



- ఏపీ లిక్కర్ స్కాంలో కీలక పరిణామం... ధనుంజయ్ రెడ్డి, కృష్ణమోహన్ రెడ్డి అరెస్ట్
- మూడు రోజుల సిట్ విచారణ అనంతరం అరెస్టు చేసిన అధికారులు
- ముందస్తు బెయిల్ పిటిషన్లను కొట్టివేసిన సుప్రీంకోర్టు
- ఈ కేసులో ఏ31, ఏ32 నిందితులుగా ఉన్న ధనుంజయ్ రెడ్డి, కృష్ణమోహన్ రెడ్డి

**అమరావతి (జర్నలిస్ట్ ఫైల్):** ఏపీ లిక్కర్ స్కాం కేసు దర్యాప్తులో నేడు కీలక పరిణామం చోటుచేసుకుంది. సుదీర్ఘ విచారణ అనంతరం, నాటి ముఖ్యమంత్రి కార్యదర్శిగా పనిచేసిన ధనుంజయ్‌రెడ్డితో పాటు, అప్పటి సీఎం ఓఎస్డీ కృష్ణమోహన్‌రెడ్డిని ప్రత్యేక దర్యాప్తు బృందం (సిట్) అధికారులు అదుపులోకి తీసుకున్నారు. మూడు రోజుల పాటు వీరిని విచారించిన సిట్ అధికారులు, మద్యం కుంభకోణంలో వీరి ప్రమేయంపై

2 లో..

## ఏపీ.. అభివృద్ధి పథం

- ఏపీలో 73 రైల్వే స్టేషన్లను అమృత్ పథకం కింద అభివృద్ధి చేస్తున్నాం
- అనంతపురం రైల్వేస్టేషన్ అభివృద్ధికి రూ.30 కోట్ల నిధులు కేటాయించాం
- కేంద్ర రైల్వేశాఖ సహాయ మంత్రి సోమన్న



**అమరావతి (జర్నలిస్ట్ ఫైల్):** రాష్ట్రంలో డబుల్ ఇంజన్ సర్కార్ అభివృద్ధి పథంలో దూసుకుపోతోందని కేంద్ర రైల్వేశాఖ సహాయ మంత్రి సోమన్న కొనియాడారు. అనంతపురం రైల్వే స్టేషన్‌ను ఆయన తనిఖీ చేశారు. అమృత్ పథకం కింద జరుగుతున్న అభివృద్ధి పనులను ఎంపీ అంబికా లక్ష్మీనారాయణతో కలిసి పరిశీలించారు. ఏపీలో 73 రైల్వే స్టేషన్లను అమృత్ పథకం కింద అభివృధి పనులు జరుగుతున్నాయన్నారు.

అనంతపురం రైల్వే స్టేషన్ అభివృద్ధికి 30 కోట్ల రూపాయల నిధులు కేటాయించినట్లు కేంద్రమంత్రి చెప్పారు. రాజమండ్రి, తిరుపతి, విశాఖ రైల్వే స్టేషన్లో అభివృధి కోసం వందల కోట్ల నిధులు కేటాయించినట్లు గుర్తు చేశారు. బెంగళూరుకు ప్రత్యేక రైలు ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. దేశంలో 1,300 రైల్వే స్టేషన్లను అమృత్ పథకం కింద నిధులు కేటాయించి అభివృధి పనులు చేస్తున్నామని మంత్రి వెల్లడించారు.

ఈ సందర్భంగా ఎంపీ అంబికా లక్ష్మీనారాయణ మాట్లాడుతూ, జిల్లాలో మొదటిసారిగా రైల్వే స్టేషన్?లో ఎస్కలేటర్?ను ప్రారంభిస్తున్నట్లు చెప్పారు. అలాగే బెంగళూరుకు ప్రత్యేక రైలు ఏర్పాటు చేసి ప్రయాణ సమయాన్ని, ఖర్చులను తగ్గిస్తున్నట్లు వెల్లడించారు. ఏపీలోని రైల్వే స్టేషన్?లో అభివృద్ధి కోసం మరిన్ని నిధులు కేటాయించాలని మంత్రి సోమన్నను ఈ సందర్భంగా కోరారు.

## పర్యాటకానికి పెద్దపీట

- పర్యాటక అభివృద్ధిలో భాగంగా స్టార్ హోటళ్ల ఏర్పాటు
- పర్యాటక శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి ఆదేశాలు
- జిల్లాలో పర్యటించిన పర్యాటక శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి అజయ్‌జైన్
- భోగాపురం ఎయిర్‌పోర్టు ప్రాంతంలో హోటళ్లు, రిసార్టుల పరిశీలన
- ఎయిర్‌పోర్టు నిర్మాణం పనులు పరిశీలన



**విజయనగరం ( జర్నలిస్ట్ ఫైల్ ):** జిల్లాలో భోగాపురం వద్ద అంతర్జాతీయ విమానాశ్రయం సిద్ధమవుతున్న తరుణంలో ఈ ప్రాంతానికి పర్యాటకులు పెద్ద ఎత్తున తరలివచ్చే అవకాశం వుందని, పర్యాటకుల వసతి కోసం అవసరమైన హోటళ్లు, రిసార్టుల అభివృద్ధికి ప్రభుత్వం అత్యధిక ప్రాధాన్యత ఇస్తున్నట్టు పర్యాటక శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి అజయ్ జైన్ చెప్పారు. భోగాపురం ప్రాంతంలో

మిగతా 3 లో..

## ప్రతిష్టాత్మకంగా.. యోగా డే

- రికార్డు సృష్టించేలా విశాఖలో అంతర్జాతీయ యోగా డే
- మే 21 నుంచి జూన్ 21 వరకు యోగా మంత్
- రాష్ట్రవ్యాప్తంగా ప్రతి గ్రామం, వార్డులో కార్యక్రమాల నిర్వహణ
- నెలరోజుల పాటు యోగా ప్రాక్టీస్ చేసిన వారికి సర్టిఫికెట్
- యోగా డే కార్యక్రమ నిర్వహణపై సీఎం చంద్రబాబు సమీక్ష

మిగతా2 లో..

## హంద్రీనీవా .. వేగవంతం



- మంత్రి నిమ్మల రామానాయుడు
- హంద్రీనీవా కాలువ లైనింగ్ పనులు పరిశీలించిన మంత్రి

**అమరావతి (జర్నలిస్ట్ ఫైల్):** హంద్రీనీవా కాలువ పనులు మరింత వేగవంతం చేస్తామని జల వనరులశాఖ మంత్రి నిమ్మల రామానాయుడు అన్నారు. సత్యసాయి జిల్లా ముదిగుబ్బ మండలం మలకవేములలో హంద్రీనీవా కాలువ లైనింగ్ పనులు మంత్రి పరిశీలించారు. ప్రతివారం పనుల పురోగతిపై అధికారులతో సమీక్ష నిర్వహిస్తానని మంత్రి తెలిపారు. అధికారులతో కలిసి కాలువ వెంట పనులు గమనిస్తూ మంత్రి నిమ్మల పనుల పురోగతిపై అక్కడికక్కడే వివరణ ఇచ్చారు. పనులను వేగవంతం చేయాలని అధికారులకు ఆదేశించారు. హంద్రీనీవా పనులను గత వైఎస్సార్సీపీ ప్రభుత్వం పూర్తిగా నిర్లక్ష్యం చేసిందని ధ్వజమెత్తారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే కాలువ లైనింగ్ అభివృద్ధి పనులు వేగవంతంగా చేసేందుకు సీఎం చంద్రబాబు ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటున్నారని మంత్రి అన్నారు.

'ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటున్నారు. ప్రతీవారం పనుల పురోగతిపై అధికారులతోనూ సంబంధిత ఏజెన్సీ లతోనూ సమీక్షజరుపాలని ఆదేశించారు. నాణ్యత విషయంలో ఎటువంటి రాజీ లేకుండా పనులు నిర్వహించేలా చర్యలు తీసుకుంటున్నాం. గతంలో ఎన్నడూ జరగని విధంగా పనులు వేగంగా జరుగుతున్నాయని ప్రజలు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.



## టెక్నాలజీతోనే దేశ ప్రగతి

- కేంద్ర సహాయ మంత్రి డాక్టర్ పెమ్మసాని
- భూ రికార్డుల రీ సర్వే డిజిటలైజేషన్ జాతీయ వర్క్‌షాప్‌లో కేంద్ర, రాష్ట్ర మంత్రులు

**గుంటూరు ( జర్నలిస్ట్ ఫైల్ ):** దేశ ప్రగతి, అభివృద్ధి ఆధునిక సాంకేతికత ద్వారానే సాధ్యమని కేంద్ర గ్రామీణాభివృద్ధి, కమ్యూనికేషన్ శాఖ సహాయమంత్రి డాక్టర్ పెమ్మసాని చంద్రశేఖర్ పేర్కొన్నారు. శుక్రవారం గుంటూరులోని ఐటీసీ వెల్కమ్ హోటల్‌లో జరిగిన భూ సర్వే/రీ సర్వే భూ రికార్డుల డిజిటలైజేషన్‌పై రెండో రోజు జాతీయ వర్క్‌షాప్ కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు.

మిగతా2 లో..

## 10 జిల్లాల డీసిహెచ్‌ఎస్‌ల మార్పు

- ఆరోగ్య మంత్రి సత్యకుమార్ యాదవ్ సమీక్షానంతరం నిర్ణయం

**అమరావతి (జర్నలిస్ట్ ఫైల్):** జిల్లాల వారీగా ప్రభుత్వ ఆసుపత్రుల పని తీరును సమగ్రంగా ఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ సమీక్షించారు. కొన్ని జిల్లా ల పనితీరు పై ఆందోళన వ్యక్తం చేశారు. ఈ నేపథ్యంలో.. డైరెక్టర్ ఆఫ్ సెకండరీ హెల్త్ డా. సిరి 10 జిల్లాల డి సి హెచ్ ఎస్ లను మార్చారు. ఆయా జిల్లాలో సెకండరీ ఆసుపత్రుల పనితీరుపై తరచుగా సూచనలు, హెచ్చరికలు చేసినా మార్పు రాలేదని, కనుక డి సి హెచ్ ఎస్ లను ఆయా 10 జిల్లాల్లో మార్చ వలసి వచ్చిందని తెలిపారు. రాష్ట్ర వ్యాప్తంగా 243 కమ్యూనిటీ హెల్త్ సెంటర్స్, ప్రాంతీయ ఆసుపత్రులు, జిల్లా ఆసుపత్రులు సెకండరీ వైద్య సేవలను అందిస్తున్నాయి డిస్ట్రిక్ట్ కోఆర్డినేటరర్స్ ఆఫ్ హెల్త్ సర్వీసెస్ లినియమితులయ్యారు.

ఆయా జిల్లాలో సెకండరీ ఆసుపత్రుల పనితీరు ఆశించిన స్థాయిలో లేనందున ఈ మార్పుల్ని చేస్తారు. కొత్త డి సి హెచ్ ఎస్ ల నియామకం జరిగిన జిల్లాలు అల్లూరి సీతారామరాజు, కోనసీమ, పశ్చిమ గోదావరి, ఎన్టీఆర్, బాపట్ల, పల్నాడు, తిరుపతి, నంద్యాల, శ్రీ సత్య సాయి మరియు అన్నమయ్య.

ఆయా జిల్లాల్లోని సెకండరీ ఆసుపత్రులు ప్రజలకు మెరుగైన సేవలందించే దిశగా పర్యవేక్షణ, నాయకత్వాన్ని అందించడం డచేస్ల ప్రధాన భాధ్యత. దీనితో పాటు సంస్థాగత ప్రసవాలు పెంపు, సిజేరియన్ ఆపరేషన్స్ తగ్గింపు,

మిగతా2 లో..



# లిక్కర్‌స్కాం.. అరెస్టుల పర్వం

(మొదటి పేజీ తరువాయి)

స్పష్టత వచ్చిన తర్వాత ఈ సాయంత్రం అరెస్టు చేసినట్లు వెల్లడించారు. దాదాపు తొమ్మిది గంటల పాటు వీరిద్దరినీ సిట్ అధికారులు ప్రశ్నించినట్లు సమాచారం.

ఈ కేసులో ధనుంజయ్‌రెడ్డి ఏ31 నిందితుడిగా, కృష్ణమోహన్‌రెడ్డి ఏ32 నిందితుడిగా ఉన్నారు. కాగా, ఇదే కేసులో వీరికి ముందస్తు బెయిల్ మంజూరు చేసేందుకు సుప్రీంకోర్టు నిరాకరించింది. ధనుంజయ్‌రెడ్డి, కృష్ణమోహన్‌రెడ్డి దాఖలు చేసుకున్న ముందస్తు బెయిల్ పిటిషన్లను సర్వోన్నత న్యాయస్థానం కొట్టివేసింది. పిటిషనర్లకు వ్యతిరేకంగా తగిన ఆధారాలు ఉన్నాయని, దర్యాప్తు కీలక దశలో ఉన్నందున ఈ సమయంలో ముందస్తు బెయిల్ ఇవ్వలేమని జస్టిస్ పార్థీవాలా నేతృత్వంలోని ధర్మాసనం స్పష్టం చేసింది. ముందస్తు బెయిల్ మంజూరు చేస్తే అది దర్యాప్తు అధికారి విచారణకు ఆటంకం కలిగించినట్లు అవుతుందని అభిప్రాయపడింది. అంతకుముందు ఆంధ్రప్రదేశ్ హైకోర్టు కూడా వీరి ముందస్తు బెయిల్ అభ్యర్థనను తిరస్కరించగా, ఆ తీర్పును సవాల్ చేస్తూ వీరు సుప్రీంకోర్టును ఆశ్రయించారు. అయితే, రెగ్యులర్ బెయిల్ కోసం నిబంధనలు, మెరిట్స్ ఆధారంగా హైకోర్టు లేదా ట్రయల్ కోర్టును ఆశ్రయించవచ్చని సుప్రీంకోర్టు సూచించింది.

వేల కోట్ల రూపాయల మద్యం కుంభకోణంగా ఆరోపణలు ఎదుర్కొంటున్న ఈ కేసులో, నాటి సీఎంవో కార్యదర్శి ధనుంజయ్‌రెడ్డి, జగన్ ఓఎస్డీ కృష్ణమోహన్‌రెడ్డితో పాటు భారతి సిమెంట్స్ పూర్తికాలపు డైరెక్టర్ గోవిందప్ప బాలాజీలను కూడా సిట్ ఇటీవల నిందితుల జాబితాలో చేర్చింది. ఈ కేసులో ఏ33 నిందితుడిగా ఉన్న గోవిందప్ప బాలాజీని సిట్ అధికారులు మంగళవారమే అరెస్టు చేసిన సంగతి తెలిసిందే.

గతంలో ఈ కేసుకు సంబంధించి మే 16 వరకు తదుపరి చర్యలు చేపట్టవద్దని సుప్రీంకోర్టు ఆదేశాలు జారీ చేసినప్పటికీ, విచారణకు హాజరుకావాలని స్పష్టం చేసింది. ఈ నేపథ్యంలోనే విజయవాడలోని సిట్ కార్యాలయంలో గత మూడు రోజులుగా వీరి విచారణ కొనసాగింది. తాజాగా సుప్రీంకోర్టు ముందస్తు బెయిల్ నిరాకరించడంతో వీరి అరెస్టుకు మార్గం సుగమమైంది.

# దివ్యాంగులకు.. గుర్తింపు కార్డులు



(మొదటి పేజీ తరువాయి)

శుక్రవారం నాడు అమరావతి వెలగపూడి సచివాలయంలో దివ్యాంగులు, వయోవృద్ధుల సంక్షేమంపై సంబంధిత అధికారులతో మంత్రి సమీక్ష నిర్వహించారు. సదరం సర్టిఫికెట్లు,PMJAY వందన వయోవృద్ధుల హెల్త్ స్కీమ్ పై చర్చించారు. ఈ సందర్భంగా మంత్రి డోలా శ్రీ బాల వీరాంజనేయస్వామి మాట్లాడుతూ.... గ్రామ సచివాలయాలు, మీసేవ కేంద్రాలతో పాటు మనమిత్ర వాట్సాప్ గవర్నెన్స్ ద్వారా సదరం స్లాట్ బుకింగ్ కి చర్యలు చేపట్టాలి. స్లాట్ బుకింగ్ చేసుకున్న రోజు నుంచి నెల రోజుల లోపు సదరం సర్టిఫికెట్లు ఇచ్చేలా చర్యలు తీసుకోవాలి. సుదూర ప్రాంతాలు, గిరిజన తండాల నుంచి వచ్చే దివ్యాంగులకు ఇబ్బందులు లేకుండా సదరం క్యాంపులు నిర్వహించాలి. దివ్యాంగులకు గుర్తింపు కార్డులు అందజేసేందుకు కేంద్ర ప్రభుత్వం చర్యలు చేపట్టింది. ఈ గుర్తింపు కార్డులో అంగవైకల్య శాతం, దివ్యాంగుల వివరాలు ఉంటాయి. గుర్తింపు కార్డులు తయారీ, జారీ చేసేందుకు అధికారులు చర్యలు చేపట్టాలి. 70 ఏళ్లు దాటిన ప్రతి ఒక్కరికీ PMJAY వందన స్కీమ్ ద్వారా రూ.5 లక్షల ఉచిత వైద్యం అందిస్తామని మంత్రి డోలా బాల వీరాంజనేయస్వామి తెలిపారు.

# టెక్నాలజీతోనే దేశ ప్రగతి



(మొదటి పేజీ తరువాయి)

ఈ కార్యక్రమంలో ఆంధ్రప్రదేశ్ మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్, అర్బన్ డెవలప్మెంట్, అర్బన్ హౌసింగ్ శాఖ మంత్రి పి. నారాయణ, రెవెన్యూ శాఖ స్పెషల్ చీఫ్ సెక్రటరీ & భూ పరిపాలన చీఫ్ కమిషనర్ జి. జయలక్ష్మి, కేంద్ర భూ వనరుల అభివృద్ధి శాఖ కార్యదర్శి మనోజ్ జోషి, డైరెక్టర్ డి.ఎన్. జోషి తదితరులు పాల్గొన్నారు.

**భూ డిజిటలైజేషన్ కీలకమైన చర్య :** పెమ్మసాని మాట్లాడుతూ, "ఈ కార్యక్రమం గ్రామీణ ప్రాంతాల అభివృద్ధికి, మహిళలు, గిరిజనుల సాధికారతకు ఎంతో కీలకం. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ గారి లక్ష్యాల మేరకు 2047 నాటికి భారత్‌ను వికసిత దేశంగా మార్చాలంటే, ఈ డిజిటలైజేషన్ ప్రాజెక్ట్ విజయవంతంగా అమలవ్వాల్సిందే," అన్నారు.

అభివృద్ధి చెందిన దేశాలు ఈ ప్రక్రియను ఎంతో ముందే పూర్తిచేశాయన్న ఆయన, మన దేశంలో పరిపాలనా సమస్యల వల్ల కొంత ఆలస్యమైనా, వచ్చే సంవత్సరాల్లో శాతం 100 గ్రౌండ్ ప్రూఫింగ్‌తో కూడిన భూ డేటాను అందుబాటులోకి తేవచ్చని విశ్వాసం వ్యక్తం చేశారు.

**ముందంజలో ఉన్న రాష్ట్రాలకు అభినందనలు :** ఈ ప్రాజెక్టులో ముందంజలో ఉన్న కర్ణాటక, అస్సాం, రాజస్థాన్, ఆంధ్రప్రదేశ్, బీహార్, హర్యానా, ఒడిశా రాష్ట్రాలకు ఆయన అభినందనలు తెలిపారు. అస్సాంలో పరిష్కరించని భూముల సమస్యల పరిష్కారం, రాజస్థాన్ 40 సెంటీమీటర్ల అధిక స్పష్టత గల శాటిలైట్ చిత్రాలతో పని చేయడం ముఖ్యమైన ముందడుగులుగా ఆయన పేర్కొన్నారు.

**ఆంధ్రప్రదేశ్ గర్వకారణం :** "మన ముఖ్యమంత్రి, నా రాజకీయ గురువు నారా చంద్రబాబు నాయుడు గారి నాయకత్వంలో మంత్రి నారాయణ, అధికార యంత్రాంగం కేవలం 10 నెలల్లో అద్భుతమైన పురోగతిని సాధించింది. దీని ఫలితంగా ప్రోత్సాహక నిధుల్లో సింహభాగం మన రాష్ట్రానికి దక్కింది," అని పెమ్మసాని గారు తెలిపారు.

**సహకార పౌరసత్వానికి ప్రతిబింబం :** ఈ ప్రాజెక్టు దేశంలో సహకార పౌరసత్వ వ్యవస్థకు ప్రతిబింబమని, విధాన, సాంకేతిక, ఆర్థిక అంశాలలో భారత ప్రభుత్వం పూర్తి మద్దతుగా ఉంటుందని ఆయన చెప్పారు. ప్రథమ దశలో దేశవ్యాప్తంగా 15 లక్షల చ.కిమీ ప్రణాళికలో 3 లక్షల చ.కిమీ భూభాగాన్ని కవర్ చేయగలిగినట్టు వివరించారు.

ఈ వేదికపై బీహార్, ఒడిశా, హర్యానా, శిబ్రా వంటి రాష్ట్రాల్లో పారదర్శక భూ రికార్డుల ఆధారిత వ్యవస్థలను అభినందించారు. చివరిగా, ఈ కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహించిన అధికారులందరికీ ఆయన కృతజ్ఞతలు తెలిపారు.

# ఉప్పొంగిన దేశభక్తి







(మొదటి పేజీ తరువాయి)

ఉగ్రవాదం అంతు చూడాలని ప్రధాని సంకల్పించారని అన్నారు. ఆపరేషన్ సిందూర్ విజయవంతమైన సందర్భంగా విజయవాడలో నిర్వహించిన తిరంగా ర్యాలీలో సీఎం చంద్రబాబు , జనసేన అధ్యక్షుడు, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్, ఏపీ రాష్ట్ర బీజేపీ అధ్యక్షురాలు దగ్గుబాటి పురందేశ్వరి, పలువురు మంత్రులు, ఎమ్మెల్యేలు పాల్గొన్నారు. ఈ సందర్భంగా సీఎం చంద్రబాబు మాట్లాడుతూ...

**సైనిక దళాలకు సెల్యూట్ :** పహల్గాం ఘటన గుర్తుకురాగానే మనలో పౌరుషం, ఉద్వేగం వస్తుంది. భార్య ముందే భర్తను, కొడుకు ముందే తండ్రిని మతం పేరు అడిగి మరీ చంపేశారు. ఆడబిడ్డల నుదుట తిలకం తుడిచిన ఉగ్రవాదులు ఈ భూమి మీద ఉండకూడదని ఆపరేషన్ సిందూర్‌కు శ్రీకారం చుట్టాం. ఉగ్రవాదంపై పోరాడుతున్న మన సైనిక దళాలకు సెల్యూట్ చేస్తున్నాను. అత్యంత కఠినమైన పరిస్థితుల్లో దేశాన్ని కాపాడుతున్న జవాన్లకు నమస్కరిస్తున్నాను. వారి పోరాటం వల్లే మనం క్షేమంగా ఉన్నాం. మన దేశ గౌరవం, బలం, బలగం సాయుధ బలగాలే. రక్షణ దళాలు... ఉగ్రవాదులు ఈ దేశంపై కన్నెత్తి చూడకుండా పోరాడాయి. మన సైనికులను చూసి ఏపీనే కాదు... దేశమంతా గర్విస్తోంది. మనం అధైర్యపడాల్సిన అవసరం లేదు. జాతీయ జెండా చూడగానే మనందరిలో ఉత్సాహం, ఉద్వేగం, దేశభక్తి కలుగుతుంది. ఆ జాతీయ జెండా రూపకర్త పింగళి వెంకయ్య ఈ ప్రాంతం వారే కావడం మనందరికీ గర్వకారణం.

**ఉగ్రవాదంపై ప్రధాని మోదీ రాజీలేని పోరాటం :** మన దేశానికి సరైన సమయంలో దొరికిన సమర్థ నాయకుడు ప్రధాని మోదీ. ప్రపంచాన్ని పట్టిపీడిస్తున్న సమస్య ఉగ్రవాదం. మనం ఎప్పుడూ ఇతర దేశాలపై యుద్ధాలకు వెళ్లం. మన జోలికి వస్తే మాత్రం తగిన బుద్ధి చెప్పితీరుతాం. ప్రధాని మోదీ ఉగ్రవాదంపై రాజీలేని పోరాటం చేస్తున్నారు. ఉగ్రవాదులు ప్రపంచంలో ఎక్కడా దాక్కున్నా తుదముట్టించేందుకు ప్రధాని సంకల్పం తీసుకున్నారు. ఆపరేషన్ సిందూర్ తో శత్రు దేశాల గుండెల్లో రైళ్లు పరుగెడుతున్నాయి. తీవ్రవాద రూపంలో మనదేశానికి వస్తే అదే వారికి చివరిరోజవుతుంది. మన దేశం రక్షణలోనే కాదు ఆర్థిక శక్తిగానూ ఎదుగుతోంది. కుట్రలు, కుతంత్రాలు, అసూయ పడేవారెవరూ మన దేశాన్ని ఏం చేయలేరు. 2047 నాటికి ప్రపంచంలోనే భారతదేశం మొదటి లేదా రెండో స్థానాల్లో నిలుస్తుంది. దేశ భద్రత, సమగ్రత కోసం మనమంతా ఏకతాటిపై నడవాలి. దేశం కోసం ప్రాణాలర్పించిన మురళీ నాయక్ స్ఫూర్తితో ముందుకు వెళదాం' అని సీఎం చంద్రబాబు అన్నారు.

# ఏపీ క్లీన్ ఎనర్జీలో ట్రెండ్ సెట్

(మొదటి పేజీ తరువాయి)

రూ. 22 వేల కోట్ల పెట్టుబడితో రూపుదిద్దుకోనున్న ఈ ప్రాజెక్టు కేవలం గ్రిడ్‌లకు శక్తినివ్వడమే కాకుండా, నిరుద్యోగ యువత ఆశయాలకు ఊతమిస్తుంది" అని పేర్కొన్నారు. పునరుత్పాదక ఇంధన ప్రాజెక్టు కేవలం పరిశ్రమ కాదని, అదొక ఉద్యమమని, భవిష్యత్ తరాలకు ఇదొక వారధి అని ఆయన అభివర్ణించారు.

"రెన్యూ పవర్ వారి పునరుత్పాదక ఇంధన సముదాయ ప్రారంభోత్సవం... సాహసోపేతమైన నిర్ణయానికి, స్థిరమైన ప్రగతికి చిహ్నం. ఈ చారిత్రాత్మక క్షణంలో భాగం కావడం నా అదృష్టంగా భావిస్తున్నాను. రూ. 22వేల కోట్ల పెట్టుబడితో చేపట్టే ఈ ప్రాజెక్ట్ రేపటి వెలుగుకు దారి చూపుతుంది. పునరుత్పాదక ఇంధన ప్రాజెక్టు కేవలం పరిశ్రమ మాత్రమే కాదు... ఇది ఒక ఉద్యమం. ఈ రోజు మన కలలకు, భవిష్యత్ తరాలకు వారధి లాంటిది. భూమిపై సూర్యకాంతి, స్వచ్ఛమైన, అమూల్యమైన గాలి లభిస్తున్నపుడు భావితరం కోసం మరోగ్రహం కోసం ఎందుకు ఆలోచించాలి? శిలాజ ఇంధనాల నుండి భవిష్యత్ ఇంధనాల వినియోగం కోసం మేం ముందడుగు వేస్తున్నాం. భావితరాల కోసం ఒక ఉన్నత లక్ష్యంతో పని చేస్తున్నాం" అని వివరించారు.

ముఖ్యమంత్రి చంద్రబాబు దార్శనికత వల్లే ఆంధ్రప్రదేశ్ క్లీన్ ఎనర్జీ రంగంలో ట్రెండ్ సెట్టర్‌గా నిలుస్తోందని లోకేశ్ కొనియాడారు. "ఇతరులు పాలసీలు చూసిన చోట ఆయన అవకాశాలను చూశారు. చంద్రబాబు గారి మార్గదర్శకత్వంలో రూపొందించిన ఇంటిగ్రేటెడ్ క్లీన్ ఎనర్జీ పాలసీ భారతదేశ హరిత విప్లవానికి బ్లూప్రింట్‌గా మారింది" అని ప్రశంసించారు. కేవలం 8 నెలల వ్యవధిలోనే టాటా పవర్, ఎన్టీపీసీ గ్రీన్ హైడ్రోజన్, వేదాంత సెరెంటికా, సెయిల్ ఇండస్ట్రీస్, బ్రూక్‌ఫీల్డ్ వంటి క్లీన్ ఎనర్జీ దిగ్గజాలను రాష్ట్రానికి రప్పించగలిగామని గుర్తుచేశారు.

**ప్రాజెక్టు వివరాలు - ఉపాధి అవకాశాలు :** అనంతపురంలో రెన్యూ సంస్థ నెలకొల్పనున్న ఈ పునరుత్పాదక ఇంధన కాంప్లెక్స్‌ను రెండు దశల్లో నిర్మించనున్నారు. తొలిదశలో రూ. 7 వేల కోట్ల పెట్టుబడితో 587 మెగావాట్ల సౌర, 250 మెగావాట్ల పవన, 415 మెగావాట్ల బ్యాటరీ స్టోరేజి యూనిట్లను ఏర్పాటు చేస్తారు. మొత్తం మీద రూ. 22 వేల కోట్ల పెట్టుబడితో 1800 మెగావాట్ల సౌర, 1 గిగావాట్ పవన, 2000 మెగావాట్ల బ్యాటరీ స్టోరేజి యూనిట్లను వివిధ దశల్లో నెలకొల్పుతారు. ఈ ప్రాజెక్టు ద్వారా సుమారు 10,000 మందికి ప్రత్యక్షంగా, పరోక్షంగా ఉద్యోగ, ఉపాధి అవకాశాలు లభిస్తాయని అంచనా.

**తిరిగి వస్తున్న పరిశ్రమలు - ప్రభుత్వ లక్ష్యాలు :** ఐదేళ్ల విరామం తర్వాత



రాష్ట్రంలో గ్రీన్ ఎనర్జీ రంగం పునరుజ్జీవనం పొందుతోందని మంత్రి లోకేష్ అన్నారు. "గత ప్రభుత్వ హయాంలో పారిపోయిన కంపెనీలన్నీ మళ్లీ ప్రజాప్రభుత్వంలో తిరిగి వస్తున్నాయి. చంద్రబాబు బ్రాండ్ వల్లే రెన్యూ వంటి సంస్థలు రాష్ట్రానికి వస్తున్నాయి," అని పేర్కొన్నారు. 2029 నాటికి 72 గిగావాట్ల పునరుత్పాదక శక్తిని సాధించాలనేది ప్రభుత్వ లక్ష్యమని, రాష్ట్ర యువతకు ఐదేళ్లలో 20 లక్షల ఉద్యోగాలు కల్పించే దిశగా ఈ ప్రాజెక్టులు దోహదపడతాయని తెలిపారు. వచ్చే నెలలోనే మెగా డీఎస్సీ ద్వారా 16,347 టీచర్ ఉద్యోగాలను భర్తీ చేస్తామని హామీ ఇచ్చారు. విద్యుత్ చార్జీలు తగ్గించాలనే లక్ష్యంతోనే ఇటువంటి సంస్థలను ప్రోత్సహిస్తున్నామని, ఇక్కడ తయారయ్యే విద్యుత్ రాష్ట్రంతో పాటు దేశ అవసరాలకు ఉపయోగపడుతుందని వివరించారు.

రెన్యూ సంస్థ ఛైర్మన్ సుమంత్ సిన్హా మాట్లాడుతూ, ముఖ్యమంత్రి చంద్రబాబు నాయకత్వంలో ఏపీ అభివృద్ధి పథంలో దూసుకువెళుతోందని, పెట్టుబడిదారులకు అనుకూలమైన విధానాలు ఉన్నాయని కొనియాడారు. ప్రధాని మోదీ వికసిత్ భారత్ లక్ష్యానికి, సీఎం చంద్రబాబు విజన్ తోడైందని, ఏపీలో ఏర్పాటు చేస్తున్న ఈ కాంప్లెక్స్ దేశంలోనే అతిపెద్దదని పేర్కొన్నారు. స్థానిక రైతులు సహకరించాలని ఆయన కోరారు.

గుంతకల్లు ఎమ్మెల్యే గుమ్మనూరు జయరాం మాట్లాడుతూ, ఈ ప్రాజెక్టు రాకతో స్థానిక రైతులకు ఎకరాకు రూ. 35 వేల వరకు కౌలు లభిస్తుందని, వారి పిల్లలకు ఉద్యోగాలు వస్తాయని ఆశాభావం వ్యక్తం చేశారు.

# 10 జిల్లాల డీసిహెచ్‌ఎస్‌ల మార్పు

(మొదటి పేజీ తరువాయి)

రోగ నిర్ధారణ పరికరాల పూర్తి వినియోగం, లక్ష్యాల మేరకు శాస్త్ర చికిత్సలు చేయడం, ఆరోగ్య సేవలన్నీటిని డాక్టర్ ఎన్టీఆర్ వైద్య సేవ క్రింద నమోదు అయ్యేలా చూడటం కూడా వారి బాధ్యం

మంగళవారం (మే 13) నాడు ఆరోగ్య శాఖ మంత్రి శ్రీ సత్యకుమార్ యాదవ్ జిల్లాల వారీగా ప్రభుత్వ ఆసుపత్రుల పని తీరును సమగ్రంగా సమీక్షించారు. కొన్ని జిల్లా ల పనితీరు పై ఆందోళన వ్యక్తం చేశారు.

ఈ నేపథ్యంలో.. డైరెక్టర్ ఆఫ్ సెకండరీ హెల్త్ డా. సిరి 10 జిల్లాల డి సి హెచ్ ఎస్ లను మార్చారు.

ఆయా జిల్లాలో సెకండరీ ఆసుపత్రుల పనితీరుపై తరచుగా సూచనలు, హెచ్చరికలు చేసినా మార్పు రాలేదని,కనుక డి సి హెచ్ ఎస్ లను ఆయా 10 జిల్లాల్లో మార్చ వలసి వచ్చిందని తెలిపారు.

రాష్ట్రవ్యాప్తంగా 243 కమ్యూనిటీ హెల్త్ సెంటర్స్, ప్రాంతీయ ఆసుపత్రులు, జిల్లా ఆసుపత్రులు సెకండరీ వైద్య సేవలను అందిస్తున్నాయి

# శివయ్య సేవలో ఇస్రో ఛైర్మన్




**శ్రీకాళహస్తి,( జర్నలిస్ట్ ఫైల్ ) :** ప్రముఖ పుణ్యక్షేత్రమైన శ్రీకాళహస్తీశ్వర స్వామి వారి దేవస్థానానికి ఇస్రో ఛైర్మన్ డాక్టర్ వి. నారాయణన్ కుటుంబ సభ్యులతో కలిసి విచ్చేశారు. ఈ సందర్భంగా దేవస్థాన అధికారులు ఆయనకు స్వాగతం పలికారు. అనంతరం శ్రీ జ్ఞాన ప్రసూనాంబ సమేత శ్రీకాళహస్తీశ్వర స్వామివారిని ప్రత్యేక దర్శనం కల్పించారు. స్వామి వారి ఆశీస్సులు పొందిన అనంతరం, ఆలయ ప్రవేశ ద్వారంలో స్మృతిచిహ్నం అందజేశారు.

# ప్రతిష్ఠాత్మకంగా.. యోగా డే

**అమరావతి (జర్నలిస్ట్ ఫైల్):** విశాఖపట్నంలో జరిగే 11వ అంతర్జాతీయ యోగా డే ను రికార్డు సృష్టించేలా నిర్వహించాలని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అన్నారు. జూన్ 21వ తేదీన జరిగే యోగా డే కార్యక్రమంలో ప్రధాని మోదీ ఈసారి విశాఖలో పాల్గొంటున్నారు. ఈ విషయాన్ని ఇప్పటికే ప్రధాని స్వయంగా ప్రకటించారు. దీంతో ఈ కార్యక్రమం చరిత్రలో నిలిచిపోయేలా చేపట్టాలని ముఖ్యమంత్రి చంద్రబాబు భావిస్తున్నారు. గ్రాండ్ సక్సెస్ చేసే అంశంపై ఫోకస్ పెట్టిన సిఎం...కార్యచరణపై క్యాంప్ ఆఫీస్‌లో అధికారులతో సమీక్ష చేశారు.

ఈ సందర్భంగా ముఖ్యమంత్రి మాట్లాడుతూ "'యోగా ఫర్ వన్ ఎర్త్, వన్ హెల్త్' ను ఈ ఏడాది యోగా దినోత్సవ థీమ్‌గా తీసుకున్నారు. 'జూన్ 21న నిర్వహించే అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని ప్రతిష్ఠాత్మకంగా తీసుకోవాలి. ప్రధాని వస్తున్న ఈ కార్యక్రమాన్ని అద్భుతంగా నిర్వహించడంతో పాటు..రాష్ట్రంలో యోగా అభ్యాసానికి ఇది నాంది పలకాలి. రాష్ట్రంలో ప్రతి ఒక్కరినీ ఈ కార్యక్రమంలో భాగస్వాములను చేయాలి. కనీసం రెండు కోట్లమందికి ఈ కార్యక్రమం చేరాలి. 'యోగాంధ్ర-2025' థీమ్‌తో రాష్ట్రంలో ప్రచారం చేపట్టాలి. దీని కోసం ప్రజలను సన్నద్ధం చేసేందుకు ఈనెల 21 నుంచి జూన్ 21 వరకు యోగా మంత్ పాటించాలి. ఈ నెల రోజులు రాష్ట్ర వ్యాప్తంగా అన్ని గ్రామ, వార్డు సచివాలయాల పరిధిలో యోగా ప్రాక్టీస్ జరగాలి. దీని కోసం ప్రైవేటు వ్యక్తులు, శిక్షకులు, యోగా అసోసియేషన్లు, నిపుణులను భాగస్వాములను చేయాలి. నెలరోజుల పాటు ఆన్‌లైన్, ఆఫ్‌లైన్ విధానంలో ప్రజలకు యోగా పై శిక్షణ ఇవ్వాలి. నెల రోజుల శిక్షణ పూర్తి చేసుకున్న వారిని గుర్తిస్తూ సర్టిఫికెట్ ఇవ్వాలి. రాష్ట్రంలో గ్రామ,వార్డు సచివాలయాల ద్వారా యోగా డేలో పాల్గొనే అంశంపై ప్రజల నుంచి రిజిస్ట్రేషన్లు తీసుకోవాలి. అదే విధంగా రాష్ట్రంలోని స్కూళ్లు, కాలేజీల విద్యార్థులను ఈ కార్యక్రమంలో భాగస్వాముల్ని చేయాలి. యోగా అనేది ప్రాథమిక బాధ్యత అనేలా ప్రతిఒక్కరూ భావించాలి. యోగా డే అనంతరం కూడా రాష్ట్రంలో యోగా సాధన ఒక వ్యాపకంగా మారాలి. రాష్ట్రంలో ప్రతి చోటా యోగాపై నెలరోజుల పాటు విస్తృత చర్చ జరగాలి. మనం నిర్వహించే యోగా డే విస్తృత ప్రాచుర్యం కల్పించడానికి ఈషా ఫౌండేషన్, ఆర్ట్ ఆఫ్ లివింగ్ వంటి సంస్థల సహకారాన్ని తీసుకోవాలి. ఎపిలో జరిగే యోగా డే గత 10 ఏళ్ల కార్యక్రమాలను తిరగరాసేలా ఉండాలి" అని సిఎం చంద్రబాబు సూచించారు.



**లక్షల మందితో కార్యక్రమం :** ఆర్‌కె బీచ్‌లో ప్రధాని కార్యక్రమం, ప్రజల పాల్గొనే ప్రాంతాలు, నిర్వహణపై అధికారులు ప్రజెటేషన్ ఇచ్చారు. ఆర్కె బీచ్ నుంచి భీమిలి బీచ్ వరకు అన్ని చోట్లా ప్రజలు యోగాసనాలు వేసేందుకు ఏర్పాట్లు చేస్తున్నట్లు తెలిపారు. ఆర్కే బీచ్ నుంచి భీమిలి బీచ్ రోడ్ వరకు సుమారు 2.5 లక్షల మంది యోగాలో పాల్గొనేందుకు అధికారులు ఏర్పాట్లు చేశారు. యోగా నిర్వహించేందుకు 68 ప్రాంతాలు గుర్తించారు. ఆర్కే బీచ్, రుషికొండ, స్కూల్, క్రికెట్, పోలీస్, స్పోర్ట్స్, నావీ ప్రాంగణాలతో పాటు పలు ఖాళీ ప్రదేశాలను యోగా నిర్వహణకు గుర్తించారు. ఈ 68 లోకేషన్ల ద్వారా 2,58,948 మంది యోగా సాధనకు అవకాశం కల్పిస్తున్నట్లు అధికారులు తెలిపారు. యోగా దినోత్సవాన్ని ప్రకటించి 10 ఏళ్లు పూర్తియిన సందర్భంగా, ప్రధాని పాల్గొనే విశాఖ కార్యక్రమాన్ని అత్యంత ఘనంగా నిర్వహించాలని సీఎం సూచించారు. ఇందులో భాగంగా 5 లక్షల మంది భాగస్వాములు అయ్యేలా ఆర్కె బీచ్ నుంచి శ్రీకాకుళం వరకు బీచ్ పొడవునా అన్ని అనుకూల ప్రాంతాల్లో ప్రజలను ఆహ్వానించి యోగా కార్యక్రమాన్ని నిర్వహించాలని సీఎం చంద్రబాబు సూచించారు.

**యోగాలో కొత్త రికార్డ్ సృష్టిద్దాం :** ప్రధానమంత్రి నరేంద్రమోదీ చొరవతో జూన్ 21వ తేదీని అంతర్జాతీయ యోగా డేగా ఐక్యరాజ్యసమితి గుర్తించింది. యోగా డే రోజుల ఉదయం 7 గంటల నుంచి 8 గంటల వరకు యోగా సాధన ఉంటుంది. 2015లో తొలిసారి అంతర్జాతీయ యోగా దినోత్సవం నాడు 36 వేల మందితో ఒకే వేదికపై నిర్వహించిన కార్యక్రమం గిన్నిస్ రికార్డుకు ఎక్కింది. తొలి ఏడాది 84 దేశాల్లో యోగాను నిర్వహించారు. ప్రపంచంలోని 170కి పైగా దేశాలు యోగా డే ను ప్రస్తుతం నిర్వహిస్తున్నాయి. 2023లో సూరత్‌లో 1,53,000 మందితో ఒకే చోట అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని జరిపి మరోసారి గిన్నిస్ వరల్డ్ రికార్డ్‌లకు ఎక్కింది. సూరత్ తరహా మోడల్‌లో విశాఖలోనూ యోగా దినోత్సవాన్ని నిర్వహించి... ఈసారి ఆ రికార్డును తిరగరాయాలని ప్రభుత్వం ఆలోచన చేస్తోంది. వైద్య ఆరోగ్య శాఖ, ఆయుష్, కేంద్ర ప్రభుత్వ శాఖల సమన్వయంతో కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నారు.

## ఫ్యూచర్ సిటీలో విద్యుత్ సరఫరా ఎలా ఉంటుందో చెప్పిన సీఎం రేవంత్ రెడ్డి



**తెలంగాణ (జర్నలిస్ట్ ఫైల్)** రాష్ట్రంలో భవిష్యత్ విద్యుత్ అవసరాలను దృష్టిలో ఉంచుకొని, ప్రతిష్ఠాత్మకంగా నిర్మించ తలపెట్టిన ఫ్యూచర్‌సిటీలో విద్యుత్ సరఫరా వ్యవస్థ పూర్తిగా భూగర్భంలోనే ఉండాలని తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అధికారులను ఆదేశించారు. ఫ్యూచర్‌సిటీలో ఎలాంటి విద్యుత్ తీగలు, టవర్లు, స్తంభాలు పైకి కనిపించకుండా, అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానంతో భూగర్భ విద్యుత్ లైన్ల వ్యవస్థను ఏర్పాటు చేయాలని ఆయన స్పష్టం చేశారు. ఉప ముఖ్యమంత్రి, విద్యుత్ శాఖ మంత్రి మల్లు భట్టి విక్రమార్కతో కలిసి సచివాలయంలో విద్యుత్ శాఖ పనితీరు, భవిష్యత్ ప్రణాళికలపై ఆయన ఉన్నత స్థాయి సమీక్ష నిర్వహించారు.

ఈ సందర్భంగా సీఎం రేవంత్ రెడ్డి మాట్లాడుతూ, హైదరాబాద్ నగరాన్ని అంతర్జాతీయ స్థాయిలో డేటా సెంటర్లకు ప్రధాన కేంద్రంగా (హబ్‌గా) తీర్చిదిద్దేందుకు ప్రభుత్వం ప్రణాళికలు రచిస్తోందన్నారు. డేటా సెంటర్లకు నిరంతరాయంగా, నాణ్యమైన విద్యుత్ సరఫరా అత్యంత కీలకమని, ఈ నేపథ్యంలో విద్యుత్ లైన్ల ఆధునికీకరణ, పటిష్టతపై ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు. ఫ్యూచర్‌సిటీ నిర్మాణం ఈ లక్ష్యాలకు అనుగుణంగా ఉండాలని, అందులో భాగంగానే భూగర్భ విద్యుత్ వ్యవస్థకు ప్రాధాన్యత ఇవ్వాలని తెలిపారు. గ్రేటర్ హైదరాబాద్ పరిధిలో కూడా ప్రయోగాత్మకంగా స్మార్ట్‌పోల్స్‌ను ఏర్పాటు చేసే అవకాశాలను పరిశీలించాలని అధికారులకు దిశానిర్దేశం చేశారు.

రానున్న మూడేళ్లలో రాష్ట్రంలో విద్యుత్ డిమాండ్ గణనీయంగా పెరగనుందని అంచనా వేస్తున్నట్లు అధికారులు సీఎంకు వివరించారు. ఈ ఏడాది ఇప్పటికే రాష్ట్రంలో విద్యుత్ గరిష్ఠ డిమాండ్ 17,162 మెగావాట్లకు చేరిందని, ఇది గత ఏడాది కంటే 9.8 శాతం అధికమని తెలిపారు. 2025-26 నాటికి ఇది 18,138 మెగావాట్లకు, 2034-35 నాటికి ఏకంగా 31,808 మెగావాట్లకు చేరుతుందని అంచనా వేశారు. పెరుగుతున్న డిమాండ్‌కు అనుగుణంగా సబ్‌స్టేషన్ల సామర్థ్యాన్ని పెంచాలని, నూతన విద్యుత్ ఉత్పత్తి ప్రణాళికలు రూపొందించాలని సీఎం ఆదేశించారు.

అంతేకాకుండా, ఔటర్ రింగ్ రోడ్డు (ఓఆర్ఆర్) వెంబడి సౌర విద్యుత్ ఉత్పత్తికి అవసరమైన ప్రణాళికలు సిద్ధం చేయాలని సీఎం రేవంత్ రెడ్డి అధికారులను ఆదేశించారు. ఇది పర్యావరణహిత విద్యుత్ ఉత్పత్తిని ప్రోత్సహించడమే కాకుండా, ప్రభుత్వ లక్ష్యాలకు అనుగుణంగా ఉంటుందని ఆయన అభిప్రాయపడ్డారు. భవిష్యత్ అవసరాలకు తగ్గట్టుగా విద్యుత్ ఉత్పత్తి, సరఫరా వ్యవస్థలను బలోపేతం చేసేందుకు అన్ని చర్యలు తీసుకోవాలని సీఎం స్పష్టం చేశారు.

## రైతులకు నాణ్యమైన విద్యుత్ ఇవ్వాలి



**తెలంగాణ (జర్నలిస్ట్ ఫైల్)** అవసరాల మేరకు విద్యుత్ సమకూర్చుకునే ప్రయత్నాలు అధికారులు చేయడం లేదని విద్యుత్ లోటు ఏర్పడితే పరిస్థితి ఏమిటని ఆలోచన కూడా లేదని ఫలితంగా విద్యుత్ కోతలు మొదలుపెట్టి దానికి మెయిన్టెనెన్స్ అనే పేరు తగిలించి తప్పించుకుంటున్నారని గర్తపురి కన్జ్యూమర్ కౌన్సిల్ వారు విద్యుత్తు చార్జీల భారం పై జరిగిన అవగాహన సదస్సుకు ముఖ్యఅతిథిగా జాతీయ వినియోగదారుల సమాఖ్య ఉపాధ్యక్షుడు హరిబాబు విచ్చేసి ప్రసంగించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ వ్యవసాయ అవసరాలకు తొమ్మిది గంటలు నిరంతరాయంగా విద్యుత్ ఇవ్వవలసింది పోయి ఏడు గంటలకు మించి ఇవ్వలేమంటున్న విద్యుత్ పంపిణీ సంస్థలు చేతులెత్తేస్తున్నాయి మరోపక్క ఈ ఏడాది మే నుంచి జూన్ వరకు విద్యుత్ డిమాండ్ భారీగా ఉంటుందని నేషనల్ లోడ్ డిస్పాచ్ సెంటర్ వారు హెచ్చరించిన అధికారులు పట్టించకపోవడం వలన వినియోగదారులు ఇబ్బందులకు గురవుతున్నారు. డిమాండ్లను తీర్చలేక కోతల విధిస్తున్న వారిపై సంబంధిత అధికారులు చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు ఈ సమావేశమునకు జిల్లావినియోగదారుల ప్రొటెక్షన్ కౌన్సిల్ సభ్యులు చేకూరి రాజశేఖర్ అధ్యక్షత వహించారు హరిబాబు ప్రసంగిస్తూ నగరాలు పట్టణాలు, గ్రామాలు ,అనే తేడా లేకుండా అధికారులు విద్యుత్ కోతలు విధ్యస్తున్నారని అన్నారు తమ అసమర్ధతను కప్పిపుచ్చుకునేందుకు సబ్ స్టేషన్ మరమ్మతులు విద్యుత్తు లైను తనిఖీ చేపడుతున్నామని అబద్ధాలు చెబుతున్నారు లైన్ మర్మంతుల పేరుతో రాష్ట్రవ్యాప్తంగా డిస్కములు వారీగా నిత్యం పగలు మూడు గంటలు రాత్రి రెండు గంటలు విద్యుత్ సరఫరా నిలిపి వేస్తున్నారు సబ్ స్టేషన్ నిర్మాణాన్ని చెప్తే ఆరోజు అంతా విద్యుత్ సరఫరా ఉండటం లేదని ఆవేదన వ్యక్తం చేశారు రాజశేఖర్ మాట్లాడుతూ థర్మల్ విద్యుత్ ఉత్పత్తి కేంద్రంలో కనీసం 15 రోజులకు సరిపడా బొగ్గు నిల్వలు అందుబాటులో ఉండాలని కేంద్రం విద్యుత్ మంత్రిత్వ శాఖ చెబుతున్నప్పటికీ మన రాష్ట్రంలో మాత్రం ఆ మేరకు నిల్వలు ఉండటం లేదని అన్నారు .ఇప్పటికే బొగ్గు నిల్వలుపెంచుకొని ఉండాల్సిందని వేసవికి ముందే ఆ పని చేయకపోవడం వల్ల బొగ్గు కొరత వస్తే అప్పుడు బహిరంగ మార్కెట్లోనే బొగ్గు కొనాల్సి వస్తుందని అధిక ధర చెల్లించి విద్యుత్ కొనాలి అందుకోసం కూడా ముందుగానే షార్ట్ టెండర్లు పిలవాలిఅది కూడా చేయలేదు ఆ భారం తిరిగి ప్రజలపైనే చార్జర్ల రూపంలో అదనపు భారం పడుతుందని ఆవేదన వ్యక్తం చేశారు జిల్లా విజిలెన్స్ కమిటీ సభ్యులు బీరాల నాగేశ్వరరావు ప్రసంగిస్తూ మే నుంచి జూన్ మధ్యకాలంలో రికార్డ్ స్థాయిలో ఏసీలు వాడటం వల్ల విద్యుత్ డిమాండ్ ఉంటుందని రాత్రి వేళలో వినియోగం ఎక్కువగా పెరుగుతుందని అన్ని రాష్ట్రాలను హెచ్చరించిన నేషనల్ లోడ్ డిస్పాచ్ సెంటర్ ముందుగానే హెచ్చరించారు అయినప్పటికీ దేశవ్యాప్తంగా 15 మెగావాట్ల నుంచి 20 మెగావాట్ల కొరత ఏర్పడిందని అన్నారు థర్మల్ విద్యుత్ కేంద్రాలకు బొగ్గు ఇతర ముడి సరుకులు అందుబాటులో లేకపోవడం అధికారుల తప్పిద మే అని అన్నారు ఈ సమావేశంలో విజిలెన్స్ కమిటీ సభ్యులు గాయకోటి బేబీ సరోజిని మునిపల్లె కవిత ప్రసంగించారు

# యాక్షన్ ప్లాన్!



- ధర తగ్గకూడదు... కొనుగోళ్లు ఆగకూడదు..
- రైతుల వద్ద మిగిలిన పొగాకును కంపెనీలు కొనాల్సిందే
- క్వింటాల్‌కు రూ.12,500 ధర చెల్లించాలి
- ప్రభుత్వానికి చెడ్డపేరు తెస్తే ఉపేక్షించం, చర్యలకు వెనకాడం
- ఇకపై రైతులతో బైబ్యాక్ పాలసీ ఒప్పందం చేసుకోవాలి
- అధికారులు, ట్రేడర్లకు ముఖ్యమంత్రి చంద్రబాబు ఆదేశం
- కిలోకు రూ.500 ధర తగ్గకుండా కోకో గింజల కొనుగోళ్లు
- కోకో కొనుగోళ్లకు త్వరలో ఆయిల్‌పామ్ తరహా విధానం
- తక్కువ ధరతో నష్టపోయిన మిర్చి రైతుల జాబితా రూపొందించండి
- సన్నరకాలు పండించేలా వరి రైతుల్ని ప్రోత్సహించండి
- వ్యవసాయ, మార్కెటింగ్ శాఖల సమీక్షలో స్పష్టం చేసిన సీఎం

**అమరావతి (జర్నలిస్ట్ ఫైల్):** రాష్ట్రంలో పొగాకు పండించిన రైతులు ఎట్టిపరిస్థితుల్లో నష్టపోకూడదని... పొగాకు రేటు తగ్గకుండా వెంటనే గిట్టుబాటు ధరకు ట్రేడర్లు కొనుగోలు చేసేలా చూడాలని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అధికారులను ఆదేశించారు. అలాగే కొనుగోళ్లను ఆపకూడదని, రైతుల దగ్గర ప్రస్తుతం ఉన్న పంట కొనుగోళ్లను వెంటనే జరపాలని స్పష్టం చేశారు. తాను రైతులు, పరిశ్రమలు-సంస్థల యజమానులు ఇద్దరితోనూ స్నేహపూర్వకంగా ఉంటానని, అలా అని రైతులకు అన్యాయం జరిగితే మాత్రం సహించేది లేదని చెప్పారు. ఈ విషయాన్ని ట్రేడర్లు దృష్టిలో పెట్టుకోవాలని, ప్రస్తుతం తలెత్తిన సంక్షోభాన్ని నివారించకుంటే ఉపేక్షించేది లేదని.. చర్యలు తీసుకోవడానికి కూడా వెనుకాడనని ముఖ్యమంత్రి కొనుగోలుదారులను హెచ్చరించారు. ఉండవల్లి నివాసంలో శుక్రవారం ముఖ్యమంత్రి పొగాకు, కోకో, మిర్చి, ధాన్యం కొనుగోళ్లు-గిట్టుబాటు ధరలపై అధికారులు, ట్రేడర్లతో సమీక్ష నిర్వహించారు. ఇందులో ప్రధానంగా పొగాకు ధర పతనం కావడంపై ముఖ్యమంత్రి అసహనం వ్యక్తం చేశారు. గిట్టుబాటు ధర వచ్చేలా చూసి... రైతుల్లో అధికారులు నమ్మకం నింపాలని, ప్రభుత్వానికి చెడ్డపేరు తీసుకురాకుండా చూడాలని స్పష్టం చేశారు.

**20 మిలియన్ కిలోల పొగాకు కొనుగోలు లక్ష్యం :**

'HD బర్లే పొగాకును నాణ్యత ఆధారంగా క్వింటాల్‌కు రూ.12,500కు కంపెనీలు కొనుగోలు చేయాలి. GPI, ITC కంపెనీలు తక్షణమే 20 మిలియన్ కిలోల కొనుగోళ్లను ప్రారంభించాలి. కంట్రోల్ రూమ్, వాట్సాప్ గ్రూప్ ద్వారా రోజువారీగా కొనుగోళ్లను పర్యవేక్షించాలి. వ్యవసాయ శాఖ ప్రతి రెండు రోజులకు ఒకసారి కొనుగోలు వివరాలను నివేదించాలి. వచ్చే సాగు సీజన్‌లో అంతర్జాతీయ డిమాండ్, ధరల ఆధారంగా HD బర్లే సాగు విస్తీర్ణాన్ని నియంత్రించేలా, ఈరకం సాగు వైపు మళ్లకుండా రైతుల్లో అవగాహన పెంచేందుకు 2025 జూన్ నుంచి సమావేశాలు నిర్వహించాలి.' అని ముఖ్యమంత్రి స్పష్టంగా పేర్కొన్నారు.

**పొగాకు నిల్వలు ఎక్కడా మిగలకూడదు :** రైతుల ఇళ్లల్లోనూ, పొలాల్లోనూ ఎక్కడా పొగాకు నిల్వలు కొనుగోళ్లు జరగకుండా మిగిలిపోకూడదని.... తక్షణం కంపెనీలు కనీస మద్దతు ధరకు కొనుగోళ్లు చేసి అవసరమైతే గోడౌన్లలో నిల్వ ఉంచుకోవాలని సూచించారు. కొనుగోళ్లు ఏస్థాయిలో జరుపుతున్నారు, ఎంతమేర ధర చెల్లిస్తున్నారు... అనే నివేదిక సోమవారం కల్లా ఇవ్వాలని ఆదేశించారు. రైతుల్లో అసంతృప్తి రావడానికి వీల్లేదని, వారు నష్టపోకూడదని స్పష్టం చేశారు.

**అనూహ్యంగా పెరిగిన పొగాకు దిగుబడి :** ఎఫ్‌సీవీ, వైట్ బర్లీ, హెచ్డీ బర్లీ.. ఈ 3 రకాల పొగాకు కలిపి 2024-25 కాలంలో రాష్ట్రంలో 1,90,456 హెక్టార్లలో సాగు చేశారని... 450 మిలియన్ కేజీల దిగుబడి వచ్చిందని అధికారులు ముఖ్యమంత్రికి వివరించారు. ఇది అత్యధిక పంట దిగుబడి అని, మిగిలిన పంటల నుంచి పొగాకు సాగు వైపు రైతులు మొగ్గు చూపించడంతో... అనూహ్యంగా ఉత్పత్తి రెట్టింపై సమస్య ఉత్పన్నం అయ్యిందన్నారు.

**అధిక ధరలు చూపి మాయాజాలం :** పొగాకు ధర పతనం కాకుండా చర్యలు తీసుకోవడంలో పొగాకు బోర్డు విఫలమైందని... జీపీఐ, ఐటీసీ వంటి ట్రేడర్లతో సరైన సమన్వయం లేదని ముఖ్యమంత్రి అన్నారు. అత్యధిక ధరలు ఆశ చూపించి రైతులు పొగాకు సాగు చేసేలా చేస్తున్న కంపెనీలు, తీరా పంట చేతికి వచ్చేసరికి అమాంతం ధరలు తగ్గించడం సరికాదన్నారు. కనీస మద్దతు ధర కల్పించకుండా సంక్షోభాన్ని సృష్టిస్తున్నారని కంపెనీల తీరును ముఖ్యమంత్రి తప్పుబట్టారు.

**బై బ్యాక్ పాలసీ ఉంటేనే పొగాకు సాగు :** ప్రస్తుతం నెలకొన్న సమస్యను అధిగమించాలంటే బైబ్యాక్ పాలసీ ఉత్తమమని ముఖ్యమంత్రి అభిప్రాయపడ్డారు. ఇకపై కంపెనీలతో రైతులు బైబ్యాక్ ఒప్పందం చేసుకోవాలని సూచించారు. బైబ్యాక్ విధానం అమలు, కొనుగోళ్లు జరిగేలా పొగాకు బోర్డు పర్యవేక్షించాలని ముఖ్యమంత్రి చెప్పారు. గ్లోబల్ డిమాండ్, సప్లయ్‌కు అనుగుణంగా ధర నిర్ణయించి రైతులకు లాభాలు వచ్చేలా చేయాలన్నారు. గిట్టుబాటు ధర ఇవ్వకుండా ఇబ్బంది పెడితే రైతులు పూర్తిగా పొగాకు పండించడం మానేస్తారని, అప్పుడు కంపెనీలన్నీ మూతపడే పరిస్థితి తలెత్తుందనే విషయాన్ని గుర్తుపెట్టుకోవాలని చెప్పారు. అలాగే క్రాప్ రీషెడ్యూల్ చేయాలని, దీనికి యాక్షన్ ప్లాన్ రూపొందించాలన్నారు. పొగాకు నుంచి ఇతర వాణిజ్య పంటల సాగు వైపు రైతులు మళ్లేలా అవగాహన కల్పించాలన్నారు. పంట మార్పిడి ద్వారానే రైతులు నష్టపోకుండా ఉంటారని ముఖ్యమంత్రి చెప్పారు.

**కొనుగోళ్ల ఆలస్యంపై కంపెనీల వివరణ :**

పొగాకు బోర్డు కేవలం FCV పొగాకు ఉత్పత్తి, ప్రాసెసింగ్, ఎగుమతులను నియంత్రిస్తుంది. వైట్ బర్లే (వినుకొండ బర్లే)ను 90 శాతం కంపెనీలు కొనుగోలు చేశాయి. మిగిలిన HD బర్లే రకాన్ని రైతులు కంపెనీలతో ఏ విధమైన ఒప్పందం లేకుండా సాగు చేస్తున్నారు. మిర్చి, మొక్కజొన్న, పత్తిలో తెగుళ్లు ఎక్కువ అవ్వడం, HD బర్లే పొగాకు మొక్కలు స్థానిక నర్సరీల్లో అందుబాటులో ఉండటంతో రైతులు ఈ రకం సాగుకు మొగ్గు చూపిస్తున్నారు. బాపట్ల, ప్రకాశం, నంద్యాల, గుంటూరు జిల్లాల్లో ప్రధానంగా ఈ రకాన్ని ఎక్కువ సాగు చేస్తున్నారు. దిగువ ఆకులు 15 మిలియన్ కిలోలు ఇప్పటికే కంపెనీలు, స్థానిక వ్యాపారులు కొనుగోలు చేశారు. మిగిలిన పంటను కొనేందుకు ఎగుమతి ఆర్డర్ల కోసం ఎదురు చూస్తున్నామని, అలాగే గోదాముల కొరత, నిధుల సమస్య ఉందని, కూలీల సమస్య వల్ల గ్రేడింగ్, ప్రాసెసింగ్ ఆలస్యంగా సాగుతోందని కంపెనీలు చెబుతున్నాయి.

**కోకోకు గిట్టుబాటు ధర కల్పించాలి :**

కోకో పంట గిట్టుబాటు ధరపైనా సమీక్షించిన ముఖ్యమంత్రి చంద్రబాబు... కోకో గింజలను కిలోకు రూ.500 ధరకు తగ్గకుండా కొనుగోలు చేయాలని మాండలీజ్ సంస్థకు సూచించారు. కోకో గింజల కొనుగోలులో రైతులను ఏ కంపెనీ దోపిడి చేయడాన్ని సహించేది లేదన్నారు. ఇతర కంపెనీలతోనూ సంప్రదింపులు జరిపి కిలో రూ.500 ధరకు కొనుగోలు చేసేలా సమన్వయం చేయాలని సూచించారు. కోకో సాగు నుంచి.... పంట విలువ పెంపు వరకు ప్రణాళికను మాండలీజ్ సంస్థ రూపొందించాలని చెప్పారు. ఆయిల్ పామ్ తరహాలో ఒక ప్రత్యేక విధానం రూపొందించాల్సి అవసరం ఉందన్నారు.

**కొనుగోలు సంస్థలు సహకరించాలి :** రైతులు, పరిశ్రమలకు అనుకూల వాతావరణాన్ని రాష్ట్ర ప్రభుత్వం కల్పిస్తోందని, ఆ విధంగానే కంపెనీలు ప్రభుత్వానికి సహకరించి రైతులకు న్యాయం చేయాలని ముఖ్యమంత్రి అన్నారు. రాష్ట్రంలో కోకో రైతుల దగ్గర చివరి గింజ వరకు కొనుగోలు జరపాలన్నారు. ఫార్వర్డ్-బ్యాక్‌వర్డ్ ఇంటిగ్రేషన్‌కు సంబంధించిన ప్రణాళికలు సిద్ధం చేయాలని అధికారులకు చెప్పారు. అంతర్జాతీయ ప్రమాణాలకు అనుగుణంగా కోకో గింజల నాణ్యతను మెరుగుపరచడానికి కొనుగోలు సంస్థలు రైతులకు అవగాహన కల్పించాల్సి ఉందన్నారు. ఇందుకు ప్రభుత్వం కూడా మద్దతు ఇస్తుందన్నారు.

**నాణ్యత సాకుతో ధర తగ్గిస్తున్న సంస్థలు :** రాష్ట్రంలో ఈ ఏడాది 12,000 మెట్రిక్ టన్నుల కోకో దిగుబడులు రాగా, ఇప్పటికే అధిక మొత్తంలో కొనుగోళ్లు పూర్తయ్యాయని అధికారులు ముఖ్యమంత్రికి వివరించారు. గతేడాది అత్యధిక ధర చెల్లించి.. ఈ ఏడాది ఒక్కసారిగా ధర తగ్గించడంతో రైతుల్లో ఆందోళన మొదలైందని తెలిపారు. ఏపీలో కోకో పంట నాణ్యత తక్కువ ఉందని, అంతర్జాతీయ ప్రమాణాలకు తగ్గట్టు లేదని చెప్పి కొనుగోలు సంస్థలు ధరలు తగ్గించాయని అన్నారు. అయితే ప్రస్తుతం కోకో రైతుల దగ్గర మిగిలిపోయిన 2,000 మెట్రిక్ టన్నుల దిగుబడిని పూర్తిగా కొనుగోలు చేయాలని ముఖ్యమంత్రి అన్నారు.

**నష్టపోయిన మిర్చి రైతులతో జాబితా :** వ్యవసాయ మార్కెట్ కమిటీల ద్వారా మిరప పంటను విక్రయించిన రైతుల జాబితాను సిద్ధం చేయాలని వ్యవసాయ మార్కెటింగ్ శాఖ అధికారులను ముఖ్యమంత్రి ఆదేశించారు. తక్కువ ధరకు అమ్మడం ద్వారా రైతులు ఎంతమేర నష్టపోయారనే దానిపై అధ్యయనం చేయాలని చెప్పారు. ఈ జాబితాలో దళారులను పూర్తిగా తొలగించి, నిజమైన రైతులను మాత్రమే చేర్చాలని స్పష్టం చేశారు. మిర్చి రైతుల్లో పురుగుమందుల వినియోగం తగ్గించేలా, ఎగుమతులు తగ్గట్టు నాణ్యతాప్రమాణాలు పాటించేలా అవగాహన కల్పించాలన్నారు.

**పూర్తి స్థాయిలో ధాన్యం సేకరణ :**

రాష్ట్రంలో ఇంకా రైతుల దగ్గర మిగిలి ఉన్న ధాన్యాన్ని కొనుగోలు చేయాలని, అలాగే సన్న రకాలు పండించేలా రైతుల్ని ప్రోత్సహించాలని ముఖ్యమంత్రి అధికారులను ఆదేశించారు. మరోవైపు ఇప్పటివరకు ఈ రబీలో 1,41,144 మంది రైతుల నుంచి 17.62 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం సేకరించామని, వీరికి రూ. 3,258 కోట్లు జమ చేసినట్టు అధికారులు ముఖ్యమంత్రికి తెలిపారు. గత ప్రభుత్వ హయాంలో 2023-24 రబీ కాలానికి కేవలం 10.97 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని 49,866 మంది రైతుల నుంచి కొనుగోలు చేసి రూ. 1,103 కోట్లు చెల్లించడం జరిగిందన్నారు. అలాగే, ఈ ఖరీఫ్‌లో 5,65,369 మంది రైతుల నుంచి 35.95 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం సేకరించామని, వీరికి రూ. 8,278 కోట్లు జమ చేసినట్టు అధికారులు ముఖ్యమంత్రికి తెలిపారు. గత ప్రభుత్వ హయాంలో 2023-24 ఖరీఫ్ కాలానికి కేవలం 29.97 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని 4,97,907 మంది రైతుల నుంచి కొనుగోలు చేసి రూ. 6,549 కోట్లు చెల్లించడం జరిగిందన్నారు.

# పర్యాటకానికి పెద్దపీట

(మొదటి పేజీ తరువాయి)

నిర్మాణంలో వున్న ఏర్పాటు కానున్న పలు హోటళ్లు, రిసార్టులను పరిశీలించే నిమిత్తం జిల్లా కలెక్టర్ డా.బి.ఆర్.అంబేద్కర్ తో కలిసి ఆయన శుక్రవారం మండలంలో విస్తృతంగా పర్యటించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పర్యాటక రంగం అభివృద్ధికి హోటళ్ల నిర్మాణం ఎంతో ముఖ్యమని పేర్కొన్నారు. భోగాపురం మండలంలోని రెడ్డికంచేరు వద్ద సన్‌రే- అవని గ్రూపు ఆధ్వర్యంలో రూ.100 కోట్ల వ్యయంతో ఏర్పాటు చేయనున్న బీచ్ రిసార్ట్‌ను పరిశీలించారు. కవులవాడ వద్ద ఇదే గ్రూపు ఆధ్వర్యంలో ఏర్పాటు చేయనున్న కన్వెన్షన్ సెంటర్ నిర్మాణం పనులను పరిశీలించారు. సుమారు 3 వేల మందికి వసతి కల్పించేలా కన్వెన్షన్ సెంటర్ ఏర్పాటు చేస్తున్నామని సన్‌రే గ్రూపు ఎం.డి. రాజబాబు యీ సందర్భంగా ప్రభుత్వ ప్రత్యేక ప్రధాన కార్యదర్శికి వివరించారు. దీని ద్వారా 300 మందికి ఉద్యోగ అవకాశాలు లభిస్తాయన్నారు. అక్కడ సన్‌రే గ్రూపు ఆధ్వర్యంలో నిర్మించిన బీచ్ రిసార్టులు, గోల్ఫ్ కోర్సును ప్రత్యేక ప్రధాన కార్యదర్శి పరిశీలించారు. ఇదే ప్రాంతంలో ఏర్పాటు చేసిన గ్రీన్‌హౌస్‌లను పరిశీలించారు. పర్యాటక అభివృద్ధిలో భాగంగా ఈ సంస్థ సవరవల్లి ప్రాంతంలో సన్‌రే రిసార్టుకు అనుబంధంగా ఏర్పాటు చేయనున్న త్రీ స్టార్ హోటల్ ప్రాజెక్టుకు ఆ ప్రాంతంలో అందుబాటులో వున్న 3.6 ఎకరాల ప్రభుత్వ భూమి అందజేసేందుకు అవసరమైన ప్రతిపాదనలు పంపించాలని ప్రత్యేక ప్రధాన కార్యదర్శి జిల్లా కలెక్టర్‌కు సూచించారు. ఈ ప్రాజెక్టు ఏర్పాటు ద్వారా ప్రభుత్వానికి ఆదాయం ఇవ్వడంతోపాటు తక్కువ ఖర్చుతో పర్యాటకుల వసతుల కల్పనకు బహుళ విధాలుగా ఉపయోగపడేలా వుండాలని చెప్పారు. జిల్లా సరిహద్దున భీమిలి మండలం అన్నవరం సముద్రతీరంలో ఏర్పాటవుతున్న మే ఫెయిర్ హోటల్ నిర్మాణ స్థలాన్ని ప్రత్యేక ప్రధాన కార్యదర్శి అజయ్‌జైన్ పరిశీలించారు. రూ.40 కోట్ల వ్యయంతో ఏర్పాటవుతున్న యీ ఫైవ్ స్టార్ హోటల్‌కు భూముల కేటాయింపులపై భీమిలి ఆర్డీవో సంగీత్ మాధుర్ తో మాట్లాడారు. హోటల్‌కు రహదారి నిర్మాణంపై కూడా ఆరా తీశారు. అన్నవరం వద్ద ఓబెరాయ్ గ్రూపు ఆధ్వర్యంలో నిర్మాణంలో వున్న ఫైవ్ స్టార్ హోటల్‌ను పర్యాటక ప్రత్యేక ప్రధాన కార్యదర్శి పరిశీలించారు. నిర్మాణంలో ఎదురవుతున్న సమస్యలపై ఆ సంస్థ ప్రతినిధులను అడిగి తెలుసుకున్నారు. విద్యుత్ సరఫరా మినహా ఎలాంటి సమస్యలు లేవని నిర్మాణ సంస్థ ప్రతినిధులు వివరించారు. రోజుకు 9 గంటలు మాత్రమే త్రీ ఫేజ్ సరఫరా వస్తోందని అందువల్ల సమస్యగా వుందన్నారు. దీనిపై చర్యలు తీసుకుంటామన్నారు.



విజయనగరం పట్టణంలో రోడ్లు భవనాల శాఖ స్థలంలో స్టార్ హోటల్ నిర్మించడం ద్వారా పర్యాటకుల వసతుల కల్పనకు ప్రతిపాదనలు సమర్పించాలని జిల్లా కలెక్టర్ డా.బి.ఆర్.అంబేద్కర్‌కు ప్రభుత్వ ప్రదాన కార్యదర్శి అజయ్ జైన్ సూచించారు. ఈ స్థలంలో హోటల్ నిర్మాణం ద్వారా అతిథిగృహం నిర్మాణంతోపాటు హోటల్ కూడా ఏర్పాటు చేయవచ్చుని తద్వారా రోడ్లు భవనాల శాఖకు కూడా ఆదాయం సమకూరుతుందన్నారు.

జిల్లాలో గృహనిర్మాణ ప్రగతి పై కూడా ఆశాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శిగా వున్న అజయ్‌జైన్ కలెక్టర్‌తో ఆరా తీశారు. గృహనిర్మాణానికి అదనపు సహాయం ప్రకటించినందున గృహనిర్మాణాలను వేగవంతం చేయాలని కోరారు. ఇళ్ల నిర్మాణానికి ఇదే సరైన సమయమని చెప్పారు. గృహనిర్మాణ సంస్థ జిల్లా ప్రాజెక్టు డైరక్టర్ మురళి గృహనిర్మాణ ప్రగతిపై వివరించారు.

ఈ పర్యటనలో పర్యాటక శాఖ ప్రాంతీయ డైరక్టర్ జి.వి.బి.జగదీష్, జిల్లా పర్యాటక అధికారి కుమారస్వామి, ఆర్.డి.ఓ. కీర్తి, భీమిలి ఆర్.డి.ఓ. సంగీత్ మాధుర్, తహశీల్దార్ సురేష్, విశాఖ జిల్లా పర్యాటక అధికారి మాధవి తదితరులు పాల్గొన్నారు.

భోగాపురం ఎయిర్ పోర్టు నిర్మాణం పనుల పరిశీలన


నిర్మాణంలో వున్న భోగాపురం అంతర్జాతీయ విమానాశ్రయాన్ని ప్రభుత్వ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి అజయ్‌జైన్ శుక్రవారం జిల్లా కలెక్టర్‌తో కలసి పరిశీలించారు. జి.ఎం.ఆర్.గ్రూపు సి.ఇ.ఓ. మన్మోయ్ రాయ్ ప్రత్యేక ప్రధాన కార్యదర్శికి టెర్మినల్ భవనం వద్ద స్వాగతం పలికి ఎయిర్ పోర్టు విశేషాలను వివరించారు. నిర్ణీత గడువు కంటే ముందుగానే ఎయిర్‌పోర్టు నిర్మాణం పూర్తిచేసే దిశగా అత్యంత వేగవంతంగా పనులు జరుగుతున్నాయని తెలిపారు. నిర్మాణం పనులపై సంతోషం వ్యక్తంచేసిన ప్రత్యేక ప్రధాన కార్యదర్శి యీ ఎయిర్‌పోర్టు ద్వారా యీ ప్రాంతంలో పర్యాటక అభివృద్ధి జరుగుతుందని ఆశాభావం వ్యక్తంచేశారు.

## రెండు ఇళ్లల్లో విలువైన ఆభరణాలు, నగదు చోరీ

**తెలంగాణ (జర్నలిస్ట్ ఫైల్)** యడ్లపాడు గ్రామంలో అర్ధరాత్రి దొంగలు రెచ్చిపోయారు.రెండు ఇళ్లను లక్ష్యంగా చేసుకుని భారీగా చోరీ చేసిన ఘటన స్థానికంగా తీవ్ర కలకలం రేపుతోంది. బాధితుల వివరాలు,పోలీసుల ప్రాథమిక విచారణ ఆధారంగా ఈ ఘటన గురువారం అర్ధరాత్రి 2 గంటల సమయంలో చోటుచేసుకున్నట్లు గుర్తించారు.గ్రామానికి చెందిన నరవారి హనుమాన్ సింగ్ అనే గృహ యజమాని తన వృత్తి నిమిత్తం వాహన డ్రైవర్‌గా వెళ్లి అర్ధరాత్రి ఇంటికి చేరగా,తలుపు తాళం పగలగొట్టబడిన దృశ్యం కనిపించింది.లోపలికి వెళ్లి చూశాడో లేదో,ఇల్లు మొత్తం చిందరవందరంగా మారిన దృశ్యం చూసి చోరీ జరిగినట్టు అర్థమై పోలీసులు సమాచారం అందించాడుబాధితుడు హనుమాన్ సింగ్ తెలిపిన వివరాల ప్రకారం కుటుంబ సభ్యులంతా పని నిమిత్తం ఊరికి వెళ్లిన నేపథ్యంలో ఇంట్లో ఎవరూ లేని సమయంలోనే ఈ దోపిడి జరిగిందని తెలిపాడు.ఈ చోరీలో ఇంట్లోనీ రూ.20 వేల నగదు,50 తులాల వెండి ఆభరణాలు,9 గ్రాముల బంగారు ఆభరణాలు,పిల్లల ఉంగరాలు,చెవి దిద్దులు వంటి విలువైన వస్తువులను అపహరించినట్లు గుర్తించినట్లు వెల్లడించాడు.

ఇక ఇదే సమయంలో ఇంటి ఎదురుగా ఉన్న దండ ప్రమీల ఇంట్లో కూడా దుండగులు చోరీ ప్రయత్నం చేసినట్టు సమాచారం.తాళం పగలగొట్టి లోపలకి వెళ్లినా,అక్కడ విలువైన వస్తువులు కనిపించకపోవడంతో దొంగలు అక్కడి నుంచి వెళ్లిపోయినట్టు అనుమాని స్తున్నారు. ప్రస్తుతం ప్రమీల గ్రామంలో లేరు.కుటుంబ సభ్యులు ఫోన్ ద్వారా ఆమెను సంప్రదించి వివరాలు సేకరించారు.సమాచారాన్ని అందుకున్న వెంటనే పోలీసులు సంఘటనా స్థలాలకు చేరుకుని క్లూస్‌టీమ్ సహాయంతో ఆధారాలను సేకరిస్తున్నారు.

## మే19న శ్రీవారి ఆర్జితసేవా ఆన్లైన్ టికెట్ల ఆగస్టు నెల కోటా విడుదల



**తిరుమల ( జర్నలిస్ట్ ఫైల్ ) :** తిరుమల శ్రీవారి ఆర్జిత సేవా టికెట్లకు సంబంధించిన ఆగస్టు నెల కోటాను మే 19న ఉదయం 10 గంటలకు టీటీడీ ఆన్‌లైన్‌లో విడుదల చేయనుంది.ఈ సేవా టికెట్ల ఎలక్ట్రానిక్ డిప్ కోసం మే 21వ తేదీ ఉదయం 10 గంటల వరకు ఆన్‌లైన్‌లో నమోదు చేసుకోవచ్చు.ఈ టికెట్లు పొందిన వారు మే 21 నుండి 23వ తేదీ మధ్యాహ్నం 12 గంటల లోపు సొమ్ము చెల్లించిన వారికి లక్కీడిప్‌లో టికెట్లు మంజూరవుతాయి.

**22న ఆర్జిత సేవా టికెట్ల విడుదల :** కల్యాణోత్సవం, ఊంజల్ సేవ, ఆర్జిత బ్రహ్మోత్సవం, సహస్రదీపాలంకార సేవ, శ్రీవారి సాలకట్ల పవిత్రోత్సవాల టికెట్లను మే 22న ఉదయం 10 గంటలకు విడుదల చేస్తారు.

**22న వర్చువల్ సేవల కోటా విడుదల :** వర్చువల్ సేవలు, వాటి దర్శన స్లాట్లకు సంబంధించిన ఆగస్టు నెల కోటాను మే 22న మధ్యాహ్నం 3 గంటలకు టీటీడీ ఆన్‌లైన్‌లో విడుదల చేయనుంది.

23న అంగప్రదక్షిణం టోకెన్లు...ఆగస్టు నెలకు సంబంధించిన అంగప్రదక్షిణం టోకెన్ల కోటాను మే 23న ఉదయం 10 గంటలకు టీటీడీ ఆన్‌లైన్‌లో విడుదల చేయనుంది.

శ్రీవాణి టికెట్ల ఆన్ లైన్ కోటా...శ్రీవాణి ట్రస్టు టికెట్లకు సంబంధించిన ఆగస్టు నెల ఆన్ లైన్ కోటాను మే 23వ తేదీ ఉదయం 11 గంటలకు టీటీడీ విడుదల చేయనుంది.

వృద్ధులు, దివ్యాంగుల దర్శన కోటా..వయోవృద్ధులు, దివ్యాంగులు, దీర్ఘకాలిక వ్యాధులున్నవారు తిరుమల శ్రీవారిని దర్శించుకునేందుకు వీలుగా ఆగస్టు నెల ఉచిత ప్రత్యేక దర్శనం టోకెన్ల కోటాను మే 23న మధ్యాహ్నం 3 గంటలకు టీటీడీ ఆన్‌లైన్‌లో విడుదల చేయనుంది.

24న ప్రత్యేక ప్రవేశ దర్శన టికెట్ల కోటా విడుదల

ఆగస్టు నెలకు సంబంధించిన ప్రత్యేక ప్రవేశ దర్శన టికెట్ల కోటాను మే 24న ఉదయం 10 గంటలకు టీటీడీ ఆన్‌లైన్‌లో విడుదల చేయనుంది.

**తిరుమల, తిరుపతిలలో గదుల కోటా విడుదల**

తిరుమల, తిరుపతిలలో ఆగస్టు నెల గదుల కోటాను మే 24న మధ్యాహ్నం 3 గంటలకు ఆన్‌లైన్‌లో విడుదల చేస్తారు.....29న శ్రీవారి సేవా కోటా విడుదల..శ్రీవారి సేవ(తిరుమల మరియు తిరుపతి), పరకామణి సేవ, నవనీత సేవ, గ్రూప్ లీడర్స్ (సీనియర్ సేవక్స్) సేవల జూలై నెల కోటాను మే 29న ఉదయం 11 గంటలకు విడుదలచేస్తారు....https://ttdevasthanams.ap.gov.in వెబ్‌సైట్ ద్వారా శ్రీవారి ఆర్జితసేవలు, దర్శన టికెట్లు బుక్ చేసుకోవాలని కోరడమైనది

# వెలిగల్లు గ్రామంలో అన్ని మౌలిక వసతులు కల్పిస్తాం

- వెలుగల్లు గ్రామంలో విస్తృతంగా పర్యటించిన మంత్రి
- వెలుగులు గ్రామ ప్రజల సమస్యలను అక్కడికక్కడే పరిష్కరించిన మంత్రి
- రాష్ట్ర రవాణా, యువజన క్రీడా శాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి



రాయచోటి మే 16 (జర్నలిస్ట్ ఫైల్) : వెలుగల్లు గ్రామంలో అన్ని మౌలిక వసతులు కల్పించి అభివృద్ధి చేయడం జరుగుతుందని రాష్ట్ర రవాణా, యువజన క్రీడ శాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి అన్నారు. గురువారం మంత్రి గాలివీడు మండలం, వెలిగల్లు గ్రామంలో విస్తృతంగా పర్యటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గతంలో అభివృద్ధికి నోచుకోని వెలిగల్లు గ్రామంలో అన్ని మౌలిక వసతులు కల్పించి అభివృద్ధి చేయడం జరుగుతుందన్నారు. ఈ గ్రామంలో సరైన రోడ్లు, డ్రైనేజీ కాలవలు, వీధిలైట్లు లేక ప్రజలు ఎన్నో ఇబ్బందులు ఎదుర్కొనే వారిని కూటమి ప్రభుత్వం ఏర్పడిన తర్వాత గ్రామంలో సిమెంట్ రోడ్లు, డ్రైనేజీ కాలవలు, వీధిలైట్లు ఏర్పాటు చేసి గ్రామాన్ని ఆదర్శంగా అభివృద్ధి చేయడం జరుగుతుందన్నారు. ఈ సందర్భంగా వెలిగల్లు గ్రామ ప్రజలు సమర్పించిన అర్జీలను మంత్రి అక్కడికక్కడే పరిష్కరించి బాధితులకు న్యాయం చేయడం జరిగింది. అనంతరం పలువురు టిడిపి నాయకుల ఆహ్వానం మేరకు మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి వారి ఇంటికి వెళ్లి ప్రతి ఒక్కరిని పేరుపేరునా పిలిచి ఆప్యాయంగా పలకరించారు.

## టీనేజ్ ప్రెగ్నెన్సీపై అవగాహన

- బాల్య వివాహాలు అరికట్టేందుకు కృషి చేయాలి
- హెల్త్ ఎడ్యూకేటర్ షఫిఉన్నిషా



వేంపల్లె మే 16 (జర్నలిస్ట్ ఫైల్) : స్థానిక హరిజనవాడలోని అంగన్వాడీ కేంద్రంలో టీనేజ్ ప్రెగ్నెన్సీ పై అవగాహన కల్పించినట్లు తాళ్లపల్లి పిహెచ్సి హెల్త్ ఎడ్యూకేటర్ షఫిఉన్నిషా అన్నారు. గురువారం టీనేజ్ ప్రెగ్నెన్సీ, బాల్య వివాహాలు వీటి వల్ల కలిగే దుష్ప్రభావాలను వివరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ 13 నుంచి 19 మధ్య వయసు వారిని టీనేజర్స్ అంటారని, ఈ వయసులో గర్భవతి కావడం మంచిది కాదన్నారు. టీనేజ్ ప్రెగ్నెన్సీ వల్ల చదువుతో పాటు ఇతరత్రా ఆర్థికపరమైన సమస్యలు ఇతరులపై ఆధార పడుతామన్నారు. రక్తహీనత, పోషకాహార లోపం, కాన్పు సమయంలో, తర్వాత రక్తస్రావం కావడం, మాతృ శిశు మరణాలు జరగవచ్చని తెలిపారు. అలాగే బాల్య వివాహాలు అరికట్టేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాల్సిన అవసరం ఉందని, బాల్య వివాహం వల్ల చదువు, ఉద్యోగం ఆగిపోతుందన్నారు. ఎక్కడైనా బాల్య వివాహాలు జరుగుతుంటే హెల్ప్ లైన్ 1098 లేదా 112 నెంబర్ లకు సంప్రదించాలని కోరారు. కాల్ చేసిన వారి వివరాలు గోప్యంగా ఉంచ బడుతుందన్నారు. ఈ కార్యక్రమంలో ఏఎన్ఎంలు జీ.లక్ష్మీదేవి, ఏ.లక్ష్మీదేవి, మహిళా పోలీస్ అర్చన, ఆశాలు తదితరులు పాల్గొన్నారు.

## ప్రజల కష్టాలు వింటూ టీ షాప్ లో టి సేవిస్తున్న మంత్రి

- మంత్రి హోదాలో సాధారణ వ్యక్తిలా టీ కొట్టులో...
- ప్రజలతో మమేకమై ఎక్కువ సమయం ప్రజా సమస్యలకే కేటాయించిన మంత్రి



రాయచోటి మే 16 (జర్నలిస్ట్ ఫైల్) : ప్రజా సమస్యల పరిష్కారమే ధ్యేయంగా మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి గురువారం ఉదయం మదనపల్లి మండలం, కర్ణాటక ఆంధ్ర బార్డర్ నందు గల ఒక టీ కొట్టులో ప్రజల కష్టాలు వింటూ టీ షాప్ లో టి సేవిస్తూ అన్ని వర్గాల ప్రజతో మమేకమయ్యారు. మంత్రి తమ పర్యటనలో భాగంగా ఎక్కడికి వెళ్లినా ఎక్కువ సమయం పేదలకే కేటాయించి బాధితుల సమస్యలు తెలుసుకొని వాటిని పరిష్కరిస్తూ ముందుకు వెళుతున్నారు. మంత్రి సాదాసీదా స్వభావంతో, ఎటువంటి ఆర్భాటం లేకుండా సాధారణ ప్రజల మధ్య కాలం గడపడం, వారి అభిప్రాయాలు వినడం ఈ పర్యటనలో ప్రధాన ఆకర్షణగా నిలిచింది. టీ షాప్ లో మంత్రిని చూసిన స్థానికులు ఆశ్చర్యపోయారు. కొందరు ఆయనతో సెల్ఫీలు తీసుకుంటూ తమ ఆనందాన్ని వ్యక్తం చేశారు. ఈ సన్నివేశాన్ని చూస్తే మంత్రి ఎక్కువగా ప్రజల మధ్య ఉండటం వారి మాటలు వినడం, వారి సమస్యలు నేరుగా తెలుసుకోవడంతో పలువురు ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

# కుర్చీ కోసమే మేయర్ సురేష్ బాబుపై అనర్హత వేటు

రాష్ట్రంలో రాక్షస పాలన రెడ్ బుక్ రాజ్యాంగం నడుస్తోంది

వేదికపై మేయర్ ఒక్కరే కూర్చోవాలి అదే చట్టం

ఎమ్మెల్యేకు కుర్చీ వేయలేదని కక్ష సాధింపు అంటే ఎలా..?

న్యాయ వ్యవస్థపై మాకు గౌరవం ఉంది..న్యాయ పోరాటం చేస్తాం

వైసీపీ జిల్లా అధ్యక్షులు పి.రవీంద్రనాథరెడ్డి




కడప బ్యూరో మే 16 (జర్నలిస్ట్ ఫైల్) : ఏపిలో కూటమి పాలనలో అభివృద్ధి లేదు కానీ కక్ష సాధింపులో మాత్రం ముందుంది అని ఆగ్రహం వ్యక్తం చేశారు కడప జిల్లా వైఎస్సార్సీపీ అధ్యక్షులు పి. రవీంద్రనాథ్ రెడ్డి. ప్రత్యేకించి రాష్ట్రంలో రాక్షస పాలన, రెడ్ బుక్ రాజ్యాంగం నడుస్తోందని, కడపలో కుర్చీల కోసం కుమ్ములాట నడుస్తోందన్నారు. కడప జిల్లా వైసీపీ కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో రవీంద్రనాథ్ రెడ్డి మాట్లాడుతూ 'ఏపీలో అభివృద్ధి లేదని, ఇచ్చిన హామీల అమలు అసలే లేదన్నారు. రెడ్ బుక్ రాజ్యాంగంతో కక్ష సాధింపులో భాగంగా రాక్షసానందం పొందుతున్నారన్నారు. కడప మేయర్ సురేష్ బాబు విషయంలోనూ అదే తీరులో వెళ్తున్నారన్నారు. నగర పాలక సంస్థకు అసలు యాక్ట్ లేదని, జిహెచ్ఎంసి యాక్టు అమలు చేసుకుంటున్నామన్నారు. మన రాష్ట్రానికి అసలు యాక్ట్ లేనే లేదన్నారు. జిహెచ్ఎం సి. యాక్టు చూపించి మా మేయర్ పై చర్యలు తీసు కోవడం విడ్డూరంగా ఉందన్నారు. మేయర్ కుమారుడి సంస్థకు కమిషనర్ రిజిస్టర్ చేస్తారని, అప్పుడు ఎందుకు రిజెక్ట్ చేయలేదని ప్రశ్నించారు. ఆరోపణల్లో ఒక్క అవినీతి చూపించ లేదని, కేవలం కుర్చీల కోసం కుమ్ములాట కోసం ఇదంతా జరుగుతోందన్నారు. వాళ్ళ పత్రికలే కుర్చీల కోసమే ఇదంతా జరుగుతుందని రాశాయన్నారు. ఎమ్మెల్యేకు చాలా కంపెనీలు ఉన్నాయని, మరి వాళ్ళు కాంట్రాక్టులు చేయవచ్చా అని ప్రశ్నించారు. మేయర్ తన వివరణలో కుమారుడి పనుల అంశం తన దృష్టికి రాలేదని వివరణ కూడా ఇచ్చారన్నారు. ఈ పనులపై ఎమ్మెల్యే మాధవిరెడ్డి నేరుగా ఫిర్యాదు చేసారని, ఇందులో రాజకీయం లేక ఏముందని ప్రశ్నించారు. నగరానికి ఆమె ఒక్క పైసా నిధులు తీసుకురాక పోగా కక్ష సాధింపులకు దిగడం సరికాదన్నారు. ఆరోపణల్లో ఏదైనా అవినీతి జరిగి ఉంటే చూపించే వారని, అలాంటిదేమీ లేకపోవడంతో కుర్చీ కుమ్ములాట కోసం ఇదంతా జరుగుతోందన్నారు. నగర పాలక సంస్థ సర్వసభ్య సమావేశంలో వేదికపై మేయర్ ఒక్కరే కూర్చోవడం చట్టమని, ఎమ్మెల్యేకు కుర్చీ వేయలేదని కక్ష సాధింపు అంటే ఎలా అని ప్రశ్నించారు. కుర్చీ వెయ్యలేదని మేయర్ ఇంటిపై చెత్త వేయించడం, తప్పుడు ఫిర్యాదులు చేయించడం, ప్రభుత్వం మారిందని అవిశ్వాసం పెట్టి దించాలని ప్రయత్నం చేశారన్నారు. అది వీలు కాకపోవడంతో ఈ రకంగా కక్ష సాధింపునకు దిగుతున్నారు. చిన్న విషయాన్ని చూపి అనర్హత అనడం దారుణమని మండిపడ్డారు. వాళ్ళు పెడుతున్న కేసులు ఏవీ కోర్టుల్లో నిలబడటం లేదన్నారు. కడప మేయర్ సురేష్ బాబు విషయంలోనూ అదే తీరులో వెళ్తున్నారన్నారు. మాకు న్యాయవ్యవస్థపై నమ్మకం ఉందని, మేము న్యాయ పోరాటం చేస్తామని ఆయన చెప్పారు. ఈ ఈ సమావేశంలో వైసిపి నాయకులు పులి సునిల్ కుమార్ కార్పొరేటర్లు షఫీ, జయచంద్రారెడ్డి, తదితరులు పాల్గొన్నారు

## తాగునీటి సమస్య నివారణకు చర్యలు

- బిటెక్ రవి కృషితో రూ.1.5 కోట్ల నిధులు
- తాగునీటి, పారిశుధ్యంపై ప్రత్యేక దృష్టి
- ఇతరత్రా సమస్యలు కూడా త్వరితగతిన పూర్తి చేస్తాం
- టిడిపి నేత రఘునాథ్ రెడ్డి



వేంపల్లె మే 16 (జర్నలిస్ట్ ఫైల్) : తాగునీటి సమస్య నివారణకు ప్రత్యేక చర్యలు చేపట్టినట్లు వేంపల్లె మండల పరిశీలకుడు రఘునాథ్ రెడ్డి అన్నారు. గురువారం స్థానిక పాపాగ్నీ నదిలో ఫిల్టర్ని ఆయన ప్రారం భించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ నియోజకవర్గ ఇంచార్జీ బిటెక్ రవి కృషి ద్వారా తాగునీటి సమస్యని అధిగమించేందుకు కలెక్టర్ తో రూ.1 .5 కోట్లు నిధులు విడుదల చేయించారన్నారు. దీంతో ఆయా ప్రాంతాల్లో కొత్త బోర్లు, ఫిల్టర్లు వేయించినట్లు తెలిపారు. దీంతో పాటు త్వరలోనే పిబిసి నుంచి పాపాగ్నీ నదికి నీటిని పారుదల చేస్తామన్నారు. రానున్న కాలంలో తాగునీటి సమస్య లేకుండా బిటెక్ రవి కృషి చేస్తున్నారన్నారు. అలాగే కొత్త ఇఓ ని నియమించామని, పంచాయతీ పరిధిలోని పారిశుధ్యం ఇతరత్రా సమస్యలు త్వరితగతిన పూర్తి చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో టిడిపి కన్వీనర్ రామమునిరెడ్డి, ఉపాధ్యక్షుడు వీరభద్ర, మైనారిటీ కన్వీనర్ తెలంగాణ వలి, నాయకులు వేమాకుమార్, మహమ్మద్, దస్కారమేష్, బాలకృష్ణారెడ్డి, మడక శ్రీను, పీరా, జబిబుల్లా, ఫయాజ్, యాసిన్ తదితరులు పాల్గొన్నారు.

## పాలీసెట్‌లో మెరిసిన తొండూరు విద్యార్థులు




తొండూరు మే 16 (జర్నలిస్ట్ ఫైల్) : బుధవారం వెలువడిన పాలీసెట్ ఫలితాలలో తొండూరు ఉన్నత పాఠశాల విద్యార్థులు సత్తా చాటారు. జె. హరికేశవ రావు 120 మార్కులకు గాను 105 మార్కులు సాధించి రాష్ట్ర స్థాయిలో 2826 వ ర్యాంక్ కైవసం చేసుకున్నాడు. ఈ విద్యార్థి 10 వ తరగతి లో 545 మార్కులు పొందాడు. ఏ. భవిత 95 మార్కులతో 6451 వ ర్యాంక్ సాధించింది. ఈ అమ్మాయి 10 వ తరగతి లో 576 మార్కులతో మండల స్థాయిలో ప్రథమ స్థానంలో నిలిచిన సంగతి విదితమే. తమ పాఠశాల విద్యార్థులు పాలీసెట్ లో మంచి ర్యాంక్ లు సాధించడం పట్ల ప్రధానోపాధ్యాయుడు కె. వి. సుబ్బారెడ్డి, సిబ్బంది, హాస్టల్ వెల్ఫేర్ ఆఫీసర్ ఫరూక్, సిబ్బంది హర్షం వ్యక్తం చేశారు

## పిడుగుపడి వ్యక్తి మృతి



తొండూరు మే 16 (జర్నలిస్ట్ ఫైల్) : తొండూరు మండలం కోరవానిపల్లి గ్రామంలో ఉండే గొర్ల కాపరి అయినా బొబ్బూరి చంద్రశేఖర్ 26 సంవత్సరాల వ్యక్తి పిడుగు పడి మరణించడం జరిగింది. ఆళ్లగడ్డ మండలం చిన్న భోద నం తిప్పనపల్లె గ్రామాల మధ్య తన యొక్కగొర్ల దొడ్డి దగ్గర గొర్లకి కాపలా ఉండగా రాత్రి నిద్రిస్తుండగా నిన్న రాత్రి ఉరుము మెరుపులతో కూడిన వర్షాలు కారణంగా పిడుగు పడి మరణించడం జరిగింది. ఈ ఘటనతో గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి.

## ఈ నెల 17న నగరంలో తిరంగా ర్యాలీ

- హాజరుకానున్న మంత్రి నారా లోకేష్..
- ఆపరేషన్ సింధూర్ విజయవంతమైన నేపథ్యంలో తిరంగా ర్యాలీ
- కార్యక్రమంలో ప్రతి ఒక్కరూ పాల్గొనాలని ఎమ్మెల్యే దగ్గుపాటి పిలుపు



అనంతపురం జిల్లా బ్యూరో మే 16 (జర్నలిస్ట్ ఫైల్) : ఆపరేషన్ సింధూర్ విజయవంతమైన నేపథ్యం లో కూటమి ప్రభుత్వం ఇచ్చిన పిలుపుమేరకు ఈనె ల 17వ తేదీన నగరంలో తిరంగా ర్యాలీ నిర్వహిసు_న్నట్లు అర్బన్ ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్ తెలిపారు. 17వ తేదీ ఉదయం 7.30 గంటలకు ఈ ర్యాలీ ప్రారంభమవుతుందని ఆయన వివరించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర పాఠశాల విద్యాశాఖ మరియు మానవ వనరుల అభివృద్ధి శాఖ మంత్రివర్యులు నారా లోకేష్ పాల్గొంటున్నట్లు ఆయన వెల్లడించారు. నగరంలోని ఆర్ట్స్ కాలేజ్ నుండి టవర్ క్లాక్ మీదుగా సప్తగిరి సర్కిల్ వరకు జరగనుందన్నారు. ప్రధాని మోదీ నాయకత్వ పటిమ, సాయుధ దళాల పరాక్రమాన్ని ప్రజలకు వివరించేలా ఇది కొనసాగనుందన్నారు. మన దేశ సమైక్యతను అలాగే ఆర్మీకి మన మద్దతు తెలిపే విధంగా ఈ ర్యాలీలో కూటమి పార్టీల నాయకులు, ప్రజా సంఘాలు, మాజీ సైనికులతో పాటు అన్ని వర్గాల వారు హాజరుకావాలని ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్ పిలుపునిచ్చారు.

## శ్వాస కోస, క్యాన్సర్, డయాలసిస్ బాధ్యులుగా నష్టపోతున్నాం

- ఎంపీటీసీ ఈశ్వర్ రాజు, కొత్తపల్లి గ్రామ ప్రజలు



రైల్వేకోడూరు మే 16 (జర్నలిస్ట్ ఫైల్) : కాలుష్య కోరల్లో రోగాల పాలిన పడి మా గ్రామ ప్రజలు మేము అనారోగ్యంతో తీవ్రంగా, నష్టపోతున్నామని గోవిందం పల్లి కొత్తపల్లి గ్రామ మాజీ ఎంపీటీసీ ముల్లపాటి ఈశ్వర్ రాజు ఏపీ పొల్యూషన్ విజయవాడ కేంద్రం మరియు జోనల్ కాలుష్య నియంత్రణ కార్యాలయం కర్నూలు ఉమ్మడి కడప జిల్లా పొల్యూషన్ కంట్రోల్ అధికారి కాలుష్య నియంత్రణ మండలి కార్యాలయాలలో ఇచ్చిన వినతుల మేరకు సంయుక్త జిల్లాల పర్యావరణ శాఖ ఇంజనీరింగ్ అధికారి సుధా కురుబ పర్యావరణ సహాయక ఇంజనీర్ అనిల్ కుమార్ రెడ్డి గోవిందం పల్లి పంచాయతీ కొత్తపల్లి గ్రామ పరిసరాలలో ఉండే మైనింగ్ కార్యకలాపాలును నిర్వహించే కంపెనీలు క్రసర్ను గురువారం పరిశీలించి పరిశీలించారు ఈ సందర్భంగా కొత్తపల్లి గ్రామ ప్రజలకు కాలుష్య కారణంగా క్యాన్సర్ శ్వాసకోస వ్యాధులు తో డయాలసిస్ బాధితులుగా మిగులుతున్నారని గ్రామస్తులు ఇచ్చిన నివేదిక ఆధారంగా పరిశీలన చేసి వాస్తవాలను తెలుసుకున్నామని నిబంధనలో అతిక్రమించి మైనింగ్ కార్యకలాపాలను నిర్వహిస్తున్న పలు మైనింగ్ కంపెనీలు, క్రసర్లను గుర్తించామని ఆయా ప్రసాద్ నిర్వాహక మరియు మైనింగ్ రవాణా సాగిస్తున్న కంపెనీల రవాణా మైనింగ్ కార్యకలాపాలు నిలిపివేయాలని ఆదేశించడం జరిగిందని అలా కాదని యధావిధిగా మైనింగ్ కార్యకలాపాలను నిర్వహిస్తే గ్రామస్తులు తమకు తెలియజేస్తే ఆయా కంపెనీల ను క్రసర్లను స్వీచ్ చేయడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో కొత్తపల్లి మాజీ ఎంపీటీసీ ముల్లపాటి ఈశ్వర్ రాజు చందర్ రాజు కేశవరాజు సుబ్బరాజు చంగల్ రాజు హరి మనీ గ్రామస్తులు పాల్గొన్నారు.

## హజ్ కమిటీ బోర్డు మీటింగ్‌కు హాజరైన ఏపీలోనే అన్నిజిల్లాల డైరెక్టర్లు



పులివెందుల మే 16 (జర్నలిస్ట్ ఫైల్) : విజయవాడ లబ్బీపేటఏరియాలో గల స్టేట్ హజ్ హౌస్ కమిటీ కార్యాలయం నందు నిర్వహించిన బోర్డు మీటింగ్ నందు హాజరైన స్టేట్ హజ్ కమిటీ డైరెక్టర్ షేక్. మహబూబ్ భాషా. హజ్ కమిటీ చెర్మెన్ హస్సన్ భాషా గారి అధ్యక్షతన నిర్వహించిన బోర్డు మీటింగ్ కు ఏపీ లోని అన్ని జిల్లా ల డైరెక్టర్లు హాజరయ్యారు. హజ్ కమిటీ డైరెక్టర్లు అందరు కలిసి కమిటీ యొక్క సభ్యులందరు మొదటి సారిగా దిగిన చిత్రపటాన్ని చెర్మెన్ హస్సన్ భాషా గారికి బహుకరించారు. అనంతరంఈ నెల 18 వ తేదీ ఆంధ్రప్రదేశ్ నలుమూలల నుండి హజ్ యాత్రలకు వెళ్లే యత్రికుల ప్రయాణ సౌకర్యాలు, భోజన సదుపాయలు గురించి చర్చించారు. హజ్ యాత్రకు వెళ్లే ముస్లిం సోదరులను విజయవాడ లోని తుమ్మలపల్లె కళాక్షేత్రం లో వసతులను సమకూర్చారు. కళాక్షేత్రం నుండి హైదరాబాద్ ఎయిర్పోర్ట్ కు వెళ్లి అక్కడి నుండి మక్కా మదీనాకు చేరే అన్ని సౌకర్యలను ఏర్పాటు చేయడం జరిగింది. ఈ యొక్క కార్యక్రమానికి ముఖ్య అతిధిగా ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడురానున్నారని చెర్మెన్ హాసన్ భాషా మీటింగ్ నందు తెలపడం జరిగింది. కార్యక్రమంలో ఏపీ స్టేట్ హజ్ కమిటీ మెంబర్లు మరియు ఈఓ, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

## మళయాల స్వామి బిఈడి కళాశాల సీజ్



ప్రొద్దుటూరు, మే 16 (జర్నలిస్ట్ ఫైల్) : స్థానిక శ్రీ కృష్ణ గీతాశ్రమంలో నిర్వహిస్తున్న శ్రీ మళయాల స్వామి బిఈడి కళా శాల నిర్వాహకులు దేవాదాయశాఖ కు 2019 నుండి బాడుగలు చెల్లించకపోవ దంతో గీతాశ్రమం ఈఓ కళాశాలను సీజ్ చేసారు. కళాశాల నిర్వాహకులు బకాయి వున్న బాడుగ చెల్లించాలని ఈఓ రామచంద్రాచార్యులు నాలుగు సార్లు నోటీసులు ఇచ్చినా స్పందించక పోవడంతో ఈఓ విషయాన్ని ఉన్నతాధికారుల దృష్టికి తీసికొని వచ్చి కళాశాల సీజ్ చేసారు. ఈఓ ఈ సందర్భంగా మాట్లాడుతూ ఆరు సంవత్సరాల పాటు మళయాల స్వామి బిఈడి కళాశాల వారి బాడుగ బకాయి వుందని, ఎన్ని సార్లు చెల్లించాలని తెలిపినా స్పందించలేదని తెలిపారు. ఉన్నతాధికారుల సూచనల మేరకు కళాశాలను సీజ్ చేసినట్లు వివరించారు.

## ప్రతిభ చాటిన జెవివి విద్యార్థులు

ఏపీఆర్జేసీ - పాలీసెట్ పరీక్షా ఫలితాలలో



ప్రొద్దుటూరు, మే 16 (జర్నలిస్ట్ ఫైల్) : జన విజ్ఞాన వేదిక ప్రొద్దుటూరు శాఖ వారు నిర్వహించిన ఉచిత ఏపీఆర్జేసీ - పాలీసెట్ కోచింగ్ లో శిక్షణ పొందిన విద్యార్థులు చక్కని ర్యాకులతో ప్రతిభ చాటారని జనవిజ్ఞాన వేదిక రాష్ట్ర కార్యదర్శి తవ్వా సురేష్, జిల్లా గౌరవ సలహాదారులు గోపీనాథ్ రెడ్డి తెలిపారు. స్థానిక జెవివి ఆఫీసు నందు గురువారం ఏపీఆర్జేసీ - పాలీసెట్ విద్యార్థులతో ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గత నెలలో జరిగిన ఏ.పి.ఆర్.జె.సి. పరీక్షలో బి. సంజన రెడ్డి 365, ఎస్. హుసేన్ వల్లి 7867 ర్యాంకులు సాధించారని, అదేవిధంగా పాలీసెట్ లో యం. లోక్ నాథ్ 2080, జె. హరికేశవ రావు 2826, ఎస్.ఎస్. జుబేదా 5546, కె. యశ్వంత్ 6733, పి. హాసిని 7573, పి.వి. సాయిచరణ్ 7879 ర్యాంకులు సాధించారని, రాసిన ప్రతిఒక్కరూ క్వాలిఫై అయ్యారని తెలిపారు. జనవిజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో ఉచితంగా పాలీసెట్ కోచింగ్ ని గత మూడు సంవత్సరాలుగా నిర్వహిస్తున్నామని, వారికి ఉచిత కోచింగ్ ని అందించడంతో పాటు గౌతమి ఇంజనీరింగ్ కాలేజీ సహకారంతో విద్యార్థులకు మెటీరియల్స్ ని కూడా అందించామని వారు తెలిపారు. ఉత్తమ ర్యాంకులు సాధించిన వారిని ఈ సందర్భంగా అభినందించారు. ఉచిత కోచింగ్ కి అనేకమంది ఉపాధ్యాయులు వారి మేథోసంపత్తిని అందించినందుకు వారికి ధన్యవాదాలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో జనవిజ్ఞాన వేదిక నాయకులు వేంపల్లి రాజశేఖర్, దేవానంద్, రాకేష్, గురు, మహమూద్, జి.టి. ఈశ్వరయ్య, తిరుమలకొండు, అల్లాబకస్, విద్యార్థులు హేమలత, హాసిని, సోయబ్, భరత్ నరసింహ, భువన్, భవేష్, గురుచందన, శిరీష, సుజిత, ఆస్రి, సారధి, తనుశ్రీ తదితరులు పాల్గొన్నారు.

## అనాధవృద్ధులకు అన్నదానం

- అనాధల పట్ల శ్రద్ధ చూపాలి
- వైకాపా మండల ఉపాధ్యక్షుడు కె.రవిశంకర్ గౌడ్



వేంపల్లె మే 16 (జర్నలిస్ట్ ఫైల్) : స్థానిక గండిరోడ్డులో ఉన్న మధర్ థెరిస్సా ఛారిటబుల్ ట్రస్ట్ వృద్ధాశ్రమంలో అనాధవృద్ధులకు అన్నదానం నిర్వహించారు. గురువారం వైకాపా మండల ఉపాధ్యక్షుడు, గౌడ సంఘం జిల్లా అధ్యక్షుడు కె.రవిశంకర్ గౌడ్ తల్లి కంపరాజు లక్ష్మిదేవమ్మ ద్వితీయ వర్ధంతి సందర్భంగా కుటుంబ సభ్యులు అనాధవృద్ధులకు అన్నదానం, పండ్లు-స్వీట్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా కె.రవిశంకర్ గౌడ్ మాట్లాడుతూ అనాధల పట్ల శ్రద్ధ చూపాల్సిన అవసరం ఉందని, వారికి అండగా నిలవాలన్నారు. తమ తల్లి ద్వితీయ వర్ధంతి వేడుకలు అనాధ వృద్ధుల మధ్య జరపడం చాలా సంతోషంగా ఉందన్నారు. అలాగే ప్రతి ఒక్కరూ అనాధవృద్ధులకు చేయూత అందించాలని కోరారు. మానవ సేవే మాధవ సేవగా భావించి, సమాజంలోని నిస్సాహాయులకు అండగా నిలవాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో కుటుంబ సభ్యులు సంజీవ కుమార్ గౌడ్, విజయభాస్కర్ గౌడ్, ఆశ్రమ నిర్వాహకుడు, తదితరులు పాల్గొన్నారు.

## ఎన్నారై విద్యాసంస్థ ఉచిత శిక్షణకు విశేష ఫలితం



- పాలిసెట్ ఫలితాల్లో మెరిసిన అన్యూన్య
- జిల్లా స్థాయిలో మూడవ ర్యాంకు - రాష్ట్రంలో 326వ ర్యాంకు

గుంటూరు (జర్నలిస్టు ఫైల్): గుంటూరు జిల్లాకు చెందిన విద్యార్థిని కాకుమాను అన్యూన్య పాలిసెట్ పరీక్షలో గణనీయమైన విజయాన్ని సాధించింది. బుధవారం రాత్రి విడుదలైన పాలిసెట్ ఫలితాల్లో అన్యూన్య [హాల్ టికెట్ నెం. 3461494] 120కి 116 మార్కులు సాధించి జిల్లా స్థాయిలో మూడవ ర్యాంకు, రాష్ట్ర స్థాయిలో 326వ ర్యాంకును పొందింది.
ఈ సందర్భంగా ఎన్నారై పాలిటెక్నిక్ కళాశాల మరియు రోటరీ క్లబ్ అఫ్ గుంటూరు అచీవర్స్ సంయుక్తంగా నిర్వహించిన ఉచిత శిక్షణ ఫలితంగా ఈ ఘనత సాధ్యమైందని ఎన్నారై విద్యాసంస్థల ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ పిడికిటి తిలక్ బాబు తెలిపారు.
ఉచిత శిక్షణ పొందిన 243 మంది విద్యార్థులందరూ 100 శాతం అర్హత సాధించటం గర్వకారణమని ఆయన పేర్కొన్నారు.
ఈ విజయం తమకు మరింత ఉత్తేజాన్ని ఇచ్చిందని, భవిష్యత్‌లో ప్రతి సంవత్సరం పాలిసెట్ ఉచిత శిక్షణ శిబిరాలు నిర్వహించాలని నిర్ణయించినట్లు రోటరీ అచీవర్స్ క్లబ్ సెక్రటరీ కొండపనేని విజయకృష్ణ చెప్పారు.
అన్యూన్యను ప్రత్యేకంగా అభినందించిన వారిలో తిలక్ బాబు, విజయకృష్ణతో పాటు ఎన్నారై ఇంజనీరింగ్ కళాశాల అడ్మిన్ మేనేజర్ బండారు సీతారామయ్య తదితరులు పాల్గొన్నారు.

## పారిశుధ్యకార్మికుల సేవలు వెలకట్టలేనివి




- చైర్ పర్సన్ టి. రాధిక

తెనాలి ,(జర్నలిస్ట్ ఫైల్) పట్టణ పరిధిలో పారిశుద్ధ కార్మికులు తమ విధి నిర్వహణలో అందించే సేవలు వెలకట్టలేనివని వారి మౌలిక అవసరాలను తీర్చడం పురపాలక సంఘం బాధ్యత అని మున్సిపల్ చైర్ పర్సన్ తాడిబోయిన రాధిక అన్నారు. పురపాలక సంఘ కార్యాలయంలో శుక్రవారం పురపాలక సంఘ పారిశుధ్య కార్మికుల మౌలిక వసతుల కల్పనలో భాగంగా, రేడియం జాకెట్, 12 సోపులు, కొబ్బరి నూనె4.2 ప్రజలు, తలకు క్యాప్, చేతులకు గ్లౌజులు, మొత్తం ఐదు అంశాలతో కూడిన కిట్లను పంపిణీ చేశారు. కమిషనర్ బి శేషన్న ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో మున్సిపల్ చైర్ పర్సన్ తాడిబోయిన రాధిక,400మంది పారిశుధ్యకార్మికులకు మౌలిక వసతుల కిట్లను అందజేశారు. ఈ కార్యక్రమంలో అసిస్టెంట్ కమిషనర్ లక్ష్మీపతి, ఎంహెచ్ఓ హెల్త్ నిర్మల, 15వ వార్డు కౌన్సిలర్ గుంటూరు కోటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

## నంది విగ్రహంతో కూడిన శాశ్వత తపాలా ముద్ర విడుదల




హిందూపురం (జర్నలిస్ట్ ఫైల్ ):శ్రీ సత్యసాయి జిల్లా హిందూపురం నియోజకవర్గం లేపాక్షిలో నంది విగ్రహం తో కూడిన శాశ్వత తపాలా ముద్రను మరియు వీరభద్ర స్వామి దేవస్థానం పై ప్రత్యేక పోస్ట్ కార్డులను లేపాక్షి లొ గల ఆర్ జే హెచ్ ఫంక్షన్ హాలు లో సిపిఎంజి కె ప్రకాష్ విడుదల చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ లేపాక్షి నంది యొక్క విశిష్టత తపాలా ముద్రణతో ప్రపంచ నలుమూలల విస్తరించడం జరుగుతుందని, మరియు లేపాక్షి ప్రతిష్టత గురించి తెలియజేసినారు. ఈ కార్యక్రమంలో కర్నూల్ రీజినల్ పోస్ట్మాస్టర్ జనరల్ డాక్టర్ వెన్నం ఉపేంద్ర, పోస్టల్ సూపర్డెంట్ శ్రీయు విజయకుమార్, లేపాక్షి పుస్తక రచయిత శ్రీ చిదంబ రెడ్డి, పోస్టల్ శాఖ సిబ్బంది, లేపాక్షి ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# త్వరలో రాష్ట్ర లైబ్రరీ డిజిటలైజేషన్

- సీఎస్ఆర్ ఫండ్స్, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల సహకారంతో ముందడులు
- రూ.8 కోట్లతో అభివృద్ధికి చర్యలు
లి లైబ్రరీకి ఓల్డ్ ఫ్రెండ్స్ అసోసియేషన్ చేయూత అభినందనీయం
- గుంటూరు తూర్పు ఎమ్మెల్యే నసీర్




గుంటూరు ( జర్నలిస్ట్ ఫైల్ ) : గ్రంథాలయాలకు చేయూత విద్యాదానంతో సమానమని గుంటూరు తూర్పు ఎమ్మెల్యే నసీర్ అన్నారు. గుంటూరులోని రాష్ట్ర గ్రంథాలయానికి లైబ్రరీ ఓల్డ్ ఫ్రెండ్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో కుర్చీలు, ప్యాడ్లు, వాటర్ ప్యూరిఫైర్స్ ను శనివారం అందించారు. ఈ కార్యక్రమానికి గ్రంథాలయ సంస్థ రాష్ట్ర చైర్మన్ గోనుగుంట్ల కోటేశ్వరరావుతో కలిసి ఎమ్మెల్యే నసీర్ ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. లైబ్రరీ ఓల్డ్ ఫ్రెండ్స్ తీసుకున్న ఈ నిర్ణయం రాబోయే తరానికి ఆదర్శంగా మారుతుందని తెలిపారు. రాష్ట్ర గ్రంథాలయంలో చదువుకున్న అనేక మంది గొప్ప స్థాయిలో నిలిచారని చెప్పారు. ఇదే లైబ్రరీలో తాను కూడా చదువుకున్నానని గుర్తు చేసుకున్నారు. గతంలో కేంద్ర సహాయ మంత్రి పెమ్మసానితో కలిసి గ్రంథాలయాన్ని సందర్శించామని, సీఎస్ఆర్ ఫండ్స్ ద్వారా అభివృద్ధికి ప్రణాళికలు రూపొందించామని చెప్పారు. ఇదే లైబ్రరీలో లైబ్రేరియన్ గా విధులు నిర్వహించిన అచ్చమాంబ.. ఇదే గ్రంథాలయానికి సేవ చేయాలని రావడం అభినందనీయమన్నారు. గ్రంథాలయాలు ఇకపై పుస్తకాలకే పరిమితం కాకుండా డిజిటలైజేషన్ వైపు ప్రయత్నిస్తామని వెల్లడించారు. కేంద్ర ప్రభుత్వం, సీఎస్ఆర్, రాష్ట్ర ప్రభుత్వ నిధులు కలిపి రూ. 8 కోట్లతో గ్రంథాలయాన్ని అభివృద్ధి చేయబోతున్నామని చెప్పారు. లైబ్రరీని సద్వినియోగం చేసుకుని ఉన్నత స్థానాల్లో ఉన్న వారంతా తమవంతుగా సహకారం అందించాలని పిలుపునిచ్చారు. సీఎం చంద్రబాబు నాయుడు ఆధ్వర్యంలో కూటమి ప్రభుత్వం గ్రంథాలయాలకు మహర్దశ తీసుకొచ్చేందుకు ప్రయత్నిస్తోందని తెలిపారు. ప్రస్తుత యువత లైబ్రరీలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.
కార్యక్రమంలో మురళి, పూల శ్రీనివాసరావు, వెంకటేశ్వరరావు, శివప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

## 4 వరసల రహదారి వినుకొండ అభివృద్ధికి కొత్త మలుపు: చీఫ్ విప్ జీవీ



వినుకొండ (జర్నలిస్ట్ ఫైల్ ): రాష్ట్ర ప్రభుత్వ సహకారం, రూ. 2,605కోట్లతో చేపట్టిన 4వరసల జాతీయ రహదారి వినుకొండ నియోజకవర్గం అభివృద్ధి కొత్తమలుపు అన్నారు ప్రభుత్వ చీఫ్‌విప్, స్థానిక ఎమ్మెల్యే జీవీ ఆంజ నేయులు. దానితో పాటు గుండ్లకమ్మ వాగుపై తలపెట్టిన వంతెనలు పూర్తితో ఈ ప్రాంత ప్రజల ప్రయాణకష్టాలు తీరడంతో పాటు రాయలసీమకు అనుసంధానం మరింత మెరుగుపడుతుందని హర్షం వ్యక్తం చేశారు. రహదారుల వెంబడి పరిశ్రమల ఏర్పాటుతో ఎన్నోవిధాలుగా ప్రయోజనం లభించబోతుందన్నారు. ప్రధానమంత్రి గ్రామ సడక్ యోజన కింద వినుకొండ నియోజకవర్గం లో రూ. 15.83 కోట్లతో నాగిరెడ్డిపల్లి – కొత్తపాలెం మధ్య గుండ్లకమ్మ నదిపై నిర్మిస్తున్న హై లెవల్ వంతెన పనులను శుక్రవారం చీఫ్ విప్ జీవీ ఆంజనేయులు పరిశీలించారు. అధికారులు, గుత్తేదారును అడిగి పనుల పురోగతితో పాటు నాణ్యత వివరాలను తెలుసుకున్నారు. 7.5 మీటర్ల వెడల్పుతో 250 మీటర్ల పొడవుతో ఈ వంతెనను నిర్మిస్తున్నారు. ఈ సందర్భంగా మాట్లాడిన ఆయన రూ. 16.25 కోట్లతో చేపట్టిన ఈ బ్రిడ్జి నిర్మాణంలో నాణ్యతకు అత్యంత ప్రాధాన్యం ఇస్తు న్నామని అయిదేళ్ల నిర్వహణ కూడా కాంట్రాక్టర్ బాధ్యతకే అప్పగించామన్నారు. ఇది ఫిబ్రవరి కల్లా, గోపనకొండ–పువ్వాడ మధ్య వంతెనను జూన్ నాటికి పూర్తి చేయాలని అధికారులను ఆదేశించినట్లు చెప్పారు. వంతెనల పూర్తితో వర్షాకాలంలో గుండ్లకమ్మ మీదుగా ప్రయాణ అవస్థ లు తప్పుతాయని సంతోషం వ్యక్తం చేశారు. జాతీయ రహదారికి కూడా దగ్గర అవుతుందన్నారు . రైతుల పంటల రవాణకు కొత్త వంతెనలు ఎంతో ప్రయోజనకరంగా ఉంటుందని, దూరం తగ్గడం వల్ల పెట్రో ల్, డీజిల్ ఖర్చులు ఆదా అవుతాయన్నారు. వీటికి, అలానే 4వరస రహదారికి నిధు లు ఇచ్చిన ముఖ్యమంత్రి చంద్రబాబు, సహకరిస్తున్న ప్రధానమంత్రి నరేంద్రమోదీకి ఎంతో రుణ పడి ఉంటామన్నారు. . గత వైకాపా ప్రభుత్వం 5ఏళ్లలో వీటికి కనీసం పునాదులు ఎందుకు తీయలేక పోయారని ప్రశ్నించారు. వినుకొండ నుంచే ప్రారంభమయ్యే 4వరస రహదారితో గుంటూరుకు గంటలోపే చేరుకోవచ్చని, అది ప్రజలకు, పరిశ్రమలకు కూడా వరమన్నారు. అం దుకోసమే వినుకొండ సమీపంలో 100 ఎకరాలకు పారిశ్రామిక పార్కుకు గుర్తించి అభివృద్ధి చేస్తు న్నామన్నారు. త్వరలో మరిన్ని పరిశ్రమలు తెస్తామని, మంత్రి లోకేష్‌ను కూడా ఆవిషయంలో సహకారం కోరినట్లు తెలిపారు. ఒకవైపు హైదరాబాద్, మరోవైపు చెన్నైకి మంచి రోడ్ నెట్‌వర్క్ ఉండడం వినుకొండకు దీర్ఘకాలంలో మరెంతో మేలు చేయడం ఖాయంగా కనిపిస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో కూటమి నాయకులు అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## ఏపీ రాష్ట్ర జై కాపుసేన వర్కింగ్ ప్రెసిడెంట్‌గా తిరుమలశెట్టి



మంగళగిరి, మే16(జర్నలిస్ట్ ఫైల్):ఏపీ రాష్ట్ర జై కాపుసేన వర్కింగ్ ప్రెసిడెంట్ గా మంగళగిరి కి చెందిన తిరుమలశెట్టి కొండలరావు నియమితులయ్యారు. ఈ మేరకు శుక్రవారం మంగళగిరిలో జరిగిన కార్యక్రమంలో జై కాపుసేన వ్యవస్థాపక అధ్యక్షులు బసవ చినబాబు చేతుల మీదుగా కొండలరావు నియామక పత్రాన్ని అందజేశారు. అనంతరం జరిగిన సమావేశంలో జై కాపుసేన వ్యవస్థాపక అధ్యక్షులు బసవ చినబాబు మాట్లాడుతూ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు రాష్ట్రంలోని పేద కాపులపై ప్రత్యేక దృష్టి సారించాలని, కాపులకు విద్య, వైద్యం ఉచితంగా అందించి న్యాయం చేయాలన్నారు. రాష్ట్రంలోని ప్రతి నియోజకవర్గంలో కాపు కమ్యూనిటీ హాల్స్ నిర్మాణం జరిగేలా కృషి చేయాలన్నారు. గతంలో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఓబీసీ రిజర్వేషన్ ప్రక్రియలో భాగంగా కాపులకు ఐదు శాతం రిజర్వేషన్ కల్పించేందుకు తన వంతు కృషి చేశారని, అయితే అధికారంలోకి వచ్చిన వైఎస్ జగన్ మోహన్ రెడ్డి ప్రభుత్వం ఐదు శాతం కాపుల రిజర్వేషన్ ను తుంగలో తొక్కిందని విమర్శించారు. జనసేన పార్టీ అధినేత పవన్ కళ్యాణ్ నాయకత్వం లో కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావడానికి కృషి చేసిన కాపు సామాజిక వర్గాన్ని దృష్టిలో ఉంచుకుని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు కాపులకు అయిదు శాతం రిజర్వేషన్ కల్పించాలని కోరారు. కాపు కార్పోరేషన్ రుణాలను స్థానిక ఎమ్మెల్యేల చేతుల్లో పెట్టడం వల్ల వారు తన అనూయులకు ఇచ్చుకుంటున్నారే తప్ప పేద కాపులకు న్యాయం జరగడం లేదన్నారు. కాపు కార్పోరేషన్ కు డైరెక్టర్ లను కూడా నియమించి కాపు రుణాల మంజూరు వారి ద్వారా అమలు జరిగేలా చర్యలు తీసుకోవాలన్నారు. త్వరలోనే ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ లను జై కాపుసేన తరపున కలిసి కాపు సమస్యలను వారి దృష్టికి తీసుకువెళ్లనున్నట్లు తెలిపారు. ఏపీ రాష్ట్ర జై కాపుసేన వర్కింగ్ ప్రెసిడెంట్ తిరుమలశెట్టి కొండలరావు మాట్లాడుతూ రాష్ట్రంలోని కాపుల హక్కులు, రిజర్వేషన్ల అమలు కోసం తన వంతు కృషి చేస్తానన్నారు. ఈ కార్యక్రమంలో ఏపీ జై కాపుసేన రాష్ట్ర అధ్యక్షులు బెల్లంకొండ వెంకన్న బాబు, రాష్ట్ర ఉపాధ్యక్షులు సమ్మెట వెంకన్న బాబు, చిట్టూరి రవీందర్, మేడేపల్లి కనక రామకృష్ణ , ప్రధాన కార్యదర్శి మొహమాటం అనిల్ బాబు, లీగల్ సెల్ అధ్యక్షులు లంకిశెట్టి బాలాజీ, గుంటూరు జిల్లా అధ్యక్షులు ఎడ్లపల్లి దానారావు, పల్నాడు జిల్లా అధ్యక్షులు అన్నదాసు శ్రీనివాసరావు, జిల్లా యువజన అధ్యక్షులు సోమరాజు సాంబశివరావు, గుంటూరు జిల్లా రైతు విభాగం అధ్యక్షులు వామన పల్లి శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

## జాతీయ డెంగ్యూ నివారణ దినోత్సవ ర్యాలీ



మంగళగిరి, మే 16(జర్నలిస్ట్ ఫైల్):మంగళగిరి గణపతి నగర్లోని ఇందిరా నగర్ యూపీహెచ్సీలో జాతీయ డెంగ్యూ దినోత్సవాన్ని పురస్కరించుకొని శుక్రవారం హెల్త్ సెంటర్, మలేరియా సబ్ యూనిట్ ఆధ్వర్యంలో జాతీయ డెంగ్యూ నివారణ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా హెల్త్ సెంటర్ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ పీ అనూష ఈ ఏడాది థీమ్ మైన పరిశీలించండి, శుభ్రం చేయండి, మూతలు పెట్టండి అనే మూడు అంశాలతో ఏఎన్ఎంలు, ఆశాలు, హెల్త్ సెంటర్ సిబ్బందిచే ప్రతిజ్ఞ చేయించారు. అనంతరం డాక్టర్ అనూష మాట్లాడారు. ఏడీస్ అనే పగలు కుట్టే దోమ కాటు వల్ల డెంగ్యూ సోకుతుందన్నారు. డెంగ్యూ సోకిన వారికి అధిక జ్వరం, వాంతులు, దద్దుర్లు, తలనొప్పి, కీళ్లు కండరాల నొప్పి, కళ్ళ వెనక నొప్పి, ప్లేట్ లేట్లు పడిపోయి చిగుళ్ళు, ముక్కు నుండి రక్తం కారుట వంటి లక్షణాలు ఉంటాయన్నారు. డెంగ్యూకు గురికాకుండా ఉండటానికి ప్రజలు పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవడం, టైర్లు, కొబ్బరి చిప్పలు, కూలర్స్ వంటి వాటిలో నీరు నిలవకుండా ఉంచుకోవాలన్నారు. డెంగ్యూ లక్షణాలు కనబడితే సమీపంలోని హెల్త్ సెంటర్లో ప్రభుత్వం అందించే వైద్య సేవలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని డాక్టర్ అనూష అన్నారు. ఈ కార్యక్రమంలో మలేరియా సబ్ యూనిట్ అధికారి ఏ శ్రీమన్నారాయణ, ఎయిమ్స్ వైద్యులు డాక్టర్ దీపిక, డాక్టర్ ఆదిత్య, మలేరియా సూపర్వైజర్ సైదులు, హెల్త్ అసిస్టెంట్స్ వాసు, నరసింహారావు, హెల్త్ సెంటర్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా సామూహిక గీతా పారాయణం



కనగానపల్లి (జర్నలిస్ట్ ఫైల్ ): మండల పరిధిలోని పాతపాలెం గ్రామంలో టీచర్ గులగానప్ప ఆధ్వర్యంలో ఇంటి వద్ద ఏర్పాటుచేసిన ఆరాధన కార్యక్రమంలో సామూహిక గీతా పారాయణం ఘనంగా నిర్వహించబడింది. గీతా పారాయణ కర్త ధర్మవరం కుల్లాయప్ప ఆధ్వర్యంలో సామూహిక గీతా పారాయణం భక్తిశ్రద్ధలతో ముత్యాలప్ప, రామచంద్ర కాటమయ్య శ్రీరాములు ద్వారా ఘనంగా నిర్వహించబడినది. ఈ సందర్భంగా ప్రవచనకర్తలు గురువులు మాట్లాడుతూ ప్రపంచంలో అత్యంత జ్ఞానాన్ని ప్రసాదించే గ్రంథం భగవద్గీతగా చెప్పబడినదన్నారు. గీత కేవలం జ్ఞానం మాత్రమే కాదు మోక్ష ప్రధాయిని అని కూడా స్వయంగా గీతాచార్యుడే తెలియజేశాడన్నారు. అంతటి మహిమాన్వితమైన భగవద్గీత ను పారాయణం చేయడం వల్ల వారికి ఉన్న అరిష్టాలు తొలగి సుఖ సంతోషాలతో వర్ధిల్లుతారని భగవద్గీతలోని గీతా మహత్యంలోనే పేర్కొనబడినదన్నారు. అనంతరం శ్రీ వీరబ్రహ్మేంద్ర స్వామి ఆస్థాన పీఠాధిపతి శ్రీ రామయ్య స్వామి వారి ఆధ్వర్యంలో స్వర్గీయ తలారి అక్కమ్మ ఆరాధన కార్యక్రమంను శిష్యుల సమక్షంలో ఘనంగా నిర్వహించారు.
కార్యక్రమానికి గురువులు వారి శిష్యులు పాల్గొని సత్సంగ కార్యక్రమాలు భజనలు భక్తి రసాత్మకంగా నిర్వహించారు. ఈ సందర్భంగా రామయ్య స్వామి మాట్లాడుతూ ప్రస్తుత పరిస్థితులలో కలి ప్రభావంచే ప్రపంచంలోని మానవులు అలజడులతో అష్ట కష్టాలు పడుతున్నారు. వీటి నుండి ఉపశమనం పొందడం కోసం కేవలం భక్తి మాత్రమే సరైన మార్గం చూపిస్తుందని, అదే వారిని కష్టాల నుండి గట్టెక్కించగలదన్నారు.
ఈ క్రమంలోనే ప్రతి ఒక్కరూ ధర్మమార్గాన్ని ఆచరించడానికి ప్రయత్న పూర్వకంగా పని చేయాలన్నారు. వీటన్నిటికీ సరైన మార్గం,కేవలం భగవద్గీత మాత్రమే దారి చూపుతుందన్నారు. కార్యక్రమంలో పాతపాలెం,భానుకోట, పాతపాలెం భజన బృందాలు మరియు శిష్యులు పాల్గొన్నారు.

## దేశవ్యాప్త సమ్మె జూలై 9కి వాయిదా




హిందూపురం (జర్నలిస్ట్ ఫైల్): శ్రీ సత్యసాయి జిల్లా హిందూపురం పట్టణంలోని ఇందిరా పార్కు లో ఏఐటీయూసీ పట్టణ కమిటీ కార్యదర్శి మారుతి రెడ్డి అధ్యక్షతన సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సమావేశం కు ముఖ్యఅతిథిగా ఏఐటియుసి జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ కనిశెట్టిపల్లి వినోద్ కుమార్ మరియు జిల్లా కోశాధికారి బాబు హాజరయ్యారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ ఏఐటియుసి కార్మిక సంఘం తెలపడం ఏమనగా ఈనేల మే 20వ తేదీ దేశవ్యాప్త సార్వత్రిక సమ్మెకు జాతీయ కార్మిక సంఘాలు పిలుపు ఇవ్వడం జరిగిందని, ప్రస్తుత భారత్ మరియు పాకిస్తాన్ మధ్య యుద్ధ పరిస్థితి కారణాల రీత్యా ఈ సమ్మె జులై 9వ తేదీకి జాతీయ కార్మిక సంఘాలు వాయిదా వేయటం జరిగిందని, ఈసమ్మె వాయిదాను ఫ్యాక్టరీ యాజమాన్యం, కార్మికులు, స్వచ్ఛంద సంస్థలు, ప్రభుత్వ అధికారులు ప్రజలు, మేధావులు గమనించాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో రైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షులు కేవీ చలపతి, ఏఐటియుసి పట్టణ అధ్యక్షులు జబీవుల్లా, ఆటో యూనియన్ అధ్యక్షులు సమీవుల్లా, కార్యదర్శి నౌషద్, మున్సిపల్ వర్కర్స్ యూనియన్ అధ్యక్షులు ముత్యాలప్ప, కార్యదర్శి సిద్దగిరి సురేష్, ఈరప్ప, నవీన్, తదితరులు పాల్గొన్నారు.

# నగర ప్రజల భద్రతకు పటిష్ట చర్యలు తీసుకోండి - కమిషనర్

- జోరు వర్షాలు - ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచన



గుంటూరు (జర్నలిస్ట్ ఫైల్): రాబోయే మూడు రోజులపాటు వర్షాలు కురిసే అవకాశమున్న నేపథ్యంలో గుంటూరు నగర ప్రజలకు ఎలాంటి అసౌకర్యాలు కలగకుండా ముందస్తుగా పటిష్ట చర్యలు తీసుకోవాలని నగర కమిషనర్ పులి శ్రీనివాసులు అధికారులను ఆదేశించారు. శుక్రవారం ఆయన ఇంజినీరింగ్, పట్టణ ప్రణాళిక, ప్రజారోగ్య విభాగాల అధికారులతో సమీక్ష నిర్వహించారు. అనంతరం 3 వంతెనలు, అరండల్‌పేట, అమరావతి రోడ్, విద్యానగర్ మెయిన్ రోడ్, మారుతీనగర్, కంకరగుంట ఆర్యుబి తదితర ప్రాంతాల్లో పరిశీలన చేపట్టి అధికారులకు ఆదేశాలు జారీ చేశారు.
గత రాత్రి కురిసిన వర్షానికి విరిగిన చెట్లను, హోర్డింగ్స్‌ను తక్షణమే తొలగించాలని కమిషనర్ స్పష్టం చేశారు. నీరు నిలిచిన ప్రాంతాల్లో బైలవుట్ పనులను యుద్ధప్రాతిపదికన చేపట్టాలని, కంకరగుంట ఆర్యుబి వద్ద అదనపు మోటార్లు ఏర్పాటు చేసి నీటిని బయటకు పంపించాలని ఆదేశించారు. 3 వంతెనల వద్ద నిలిచిన సిల్ట్‌ను జెట్టింగ్ మెషిన్ల ద్వారా శుభ్రం చేయాలని ఇంజినీరింగ్ అధికారులకు సూచించారు.
వర్షపు నీరు నిలిచే ప్రాంతాల్లో తక్షణ స్పందన కోసం ఉద్యానవన సిబ్బందిని standbyలో ఉంచాలని, జిఎంసి కాల్ సెంటర్‌కు వచ్చిన ఫిర్యాదులకు వెంటనే స్పందించాలని సూచించారు. త్రాగునీటి సరఫరాకు అంతరాయం కలగకుండా ముందస్తు చర్యలుగా జనరేటర్లు ఏర్పాటు చేయాలని, విద్యుత్ శాఖతో సమన్వయం చేసుకోవాలని కమిషనర్ ఆదేశించారు. మెయిన్ డ్రైన్లలోకి కలిసే చిన్న డ్రైన్ల వద్ద ఏర్పాటైన మెష్‌ల వద్ద వ్యర్థాలను ఎప్పటికప్పుడు తొలగించేలా ప్రజారోగ్య కార్మికుల పర్యవేక్షణకు సిఎంఓహెచ్‌ను ఆదేశించారు.
హోర్డింగ్స్ విరిగిపడటం, బ్యానర్లు గాలికి ఎగురుతుండటం వంటి ఘటనల నేపథ్యంలో ఆయా హోర్డింగ్స్‌ను తక్షణమే తొలగించాలని సిటీ ప్లానర్‌ను ఆదేశించారు. అలాగే నగరంలో నిర్మాణంలో ఉన్న బహుళ అంతస్తుల భవన యజమానులు వర్షాలు దృష్టిలో పెట్టుకొని తగు జాగ్రత్తలు తీసుకోవాలని, శిథిలావస్థలో ఉన్న పాత భవన యజమానులకు నోటీసులు జారీ చేయాలని పట్టణ ప్రణాళికాధికారులను కమిషనర్ ఆదేశించారు.
ఈ పర్యటనలో సిఎంఓహెచ్ డాక్టర్ అమృతం, ఈఈ సుందర్రామిరెడ్డి, డిఈఈ మధుసూధన్, ఏఈలు, టిపిఎస్‌లు, శానిటరీ ఇన్‌స్పెక్టర్లు, సచివాలయ కార్యదర్శులు పాల్గొన్నారు. ప్రజలు తమ ప్రాంతాల్లో వర్షానికి సంబంధించి ఏవైనా సమస్యలు ఎదురైనా వెంటనే జిఎంసి కాల్ సెంటర్లకు – 08632345103, 104, 105 – నంబర్లకు ఫోన్ చేయాలని కమిషనర్ పిలుపునిచ్చారు. జిఎంసి సిబ్బంది సమన్వయంతో స్పందిస్తారని ఆయన పేర్కొన్నారు.

INK OF TRUTH
జర్నలిస్ట్ ఫైల్
తెలుగు దినపత్రిక
జర్నలిస్ట్ ఫైల్ దినపత్రిక చందాదారులుగా చేరాలని అనుకుంటున్నారా?
అయితే ఈ నెంబర్‌కు ఫోన్ చేయండి
సర్క్యులేషన్ మేనేజర్
76 61 80 59 68

## ఎంఈఓ1 లకు బదిలీలు చేపట్టాలి



- ఎంఈఓ 1 అసోసియేషన్ ఏపీ రాష్ట్ర అధ్యక్షుడు సామల సింహాచలం విజ్ఞప్తి

అమరావతి ( జర్నలిస్ట్ ఫైల్ ) :రాష్ట్రవ్యాప్తంగా పనిచేస్తున్న ఎంఈఓ 1 లకు బదిలీలు చేపట్టాలని ఎంఈఓ 1 అసోసియేషన్ ఏపీ రాష్ట్ర అధ్యక్షుడు సామల సింహాచలం విజ్ఞప్తి చేశారు.

ఈ మేరకు విద్యా శాఖ మంత్రి నారా లోకేష్ కు శుక్రవారం లేఖ ద్వారా ప్రాతినిధ్యం చేసినట్లు ఆయన తెలిపారు. ఎంఈఓ 1 లుగా పనిచేస్తున్న వారిలో చాలామంది 2017 నుండి ఒకే ప్రదేశంలో 8 సంవత్సరాలు పైబడి పనిచేస్తున్నప్పటికీ ఇంతవరకు బదిలీలు నిర్వహించక పోవడం వల్ల చాలా ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. అదేవిధంగా రెండు విద్యా సంవత్సరాలు పూర్తి అయిన వారికి కూడా బదిలీ అవకాశం కల్పించాలన్నారు.

ఉద్యోగుల సాధారణ బదిలీలపై నిషేధం ఎత్తివేస్తూ ప్రభుత్వ ఉత్తర్వులు ఇచ్చినందున ఇదే సమయంలో ఎంఈఓ 1 లకు బదిలీలు నిర్వహించడం సరైనదని అన్నారు.

ఒకవేళ ఉపాధ్యాయ బదిలీల ప్రక్రియ ప్రారంభమవుతున్న దృష్ట్యా ఇబ్బంది అవుతుందని భావిస్తే, ఎంఈఓల బదిలీలు నిర్వహించి టీచర్ల బదిలీలు పూర్తయిన తర్వాత ఎంఈవో లు నూతన ప్రదేశాల్లో చేరే విధంగా ఉత్తర్వులు ఇచ్చినట్లయితే ఇబ్బంది ఉండదని తమ లేఖలో విద్యాశాఖా మంత్రికి ప్రాతినిధ్యం చేసామన్నారు.

తమ అసోసియేషన్ విజ్ఞప్తి పై విద్యా శాఖ మంత్రి సానుకూలంగా స్పందించి బదిలీలకు చర్యలు తీసుకుంటారని ఆశాభావం వ్యక్తం చేస్తున్నట్లు రాష్ట్ర అధ్యక్షులు సామల సింహాచలం, ప్రధాన కార్యదర్శి రవి నాయక్ బుక్యా లు తెలిపారు.

## శ్రీ ప్రసన్న తిరుపతి గంగమాంబ అమ్మ వారిని దర్శించుకున్న రాష్ట్ర మంత్రి



కుప్పం,(జర్నలిస్ట్ ఫైల్): కుప్పం పాతపేట లో నెలవైన శ్రీ ప్రసన్న తిరుపతి గంగమాంబ అమ్మవారిని శుక్రవారం రాత్రి రాష్ట్ర జలవనరుల అభివృద్ధి శాఖ మంత్రి నిమ్మల రామా నాయుడు,ప్రభుత్వ విప్ మరియు ఎమ్మెల్సీ డాక్టర్ కంచర్ల శ్రీకాంత్,కడ పిడి వికాస్ మర్మత్ తో కలసి దర్శించుకున్నారు.

అమ్మవారి దర్శనానికి విచ్చేసిన రాష్ట్ర జలవనరుల అభివృద్ధి శాఖ మంత్రి, ప్రభుత్వ విప్ మరియు ఎమ్మెల్సీ వారికి ఆలయ కమిటీ చైర్మన్ రవి చంద్రబాబు స్వాగతం పలికారు.

అనంతరం రాష్ట్ర జలవనరుల అభివృద్ధి శాఖ మంత్రి,ప్రభుత్వ విప్ మరియు ఎమ్మెల్సీ,కడ పిడి అమ్మ వారిని దర్శించుకుని తీర్థప్రసాదాలు స్వీకరించారులి ఈ కార్యక్రమంలో రాష్ట్ర ఏపీఎస్ఆర్టీసీ వైస్ చైర్మన్ పిఎస్ మునిరత్నం,టీటీడీ పాలకమండలి సభ్యులు శాంతారామ్,ఆలయ కమిటీ సభ్యులు, నాయకులు తదితరులు పాల్గొన్నారు .

## మామిడి రైతులను అన్ని విధాలుగా ఆదుకుంటాం



- రైతు సంఘ నాయకులు, వ్యాపారస్తులు, ఫ్యాక్టరీ యజమానులతో సమీక్ష నిర్వహించిన జిల్లా కలెక్టర్ డా. ఎస్ వేంకటేశ్వర్

తిరుపతి ( జర్నలిస్ట్ ఫైల్ ) : మామిడి రైతులను అన్ని విధాలా ఆదుకుంటామని, తగిన గిట్టు బాటు ధరలు కల్పించేలా కృషి చేయాలని సంబంధిత అధికారులను జిల్లా కలెక్టర్ డా ఎస్.వెంకటేశ్వర్ ఆదేశించారు. శుక్రవారం మధ్యాహ్నం స్థానిక కలెక్టర్ మిని సమావేశపు హాలు నందు జాయింట్ కలెక్టర్ శుభం బన్సల్, మామిడి ఫ్యాక్టరీ యాజమానులు, రైతు సంఘ నాయకులు, వ్యాపారస్తులుతో కలిసి జిల్లా కలెక్టర్ డా.ఎస్. వెంకటేశ్వర్ సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ.. ప్రభుత్వం మామిడి రైతులకు అండగా ఉంటుందని తెలిపారు. రాబోయే మామిడి సీజన్‌కు సంబంధించి జిల్లాలో నెలల వారీగా వచ్చే మామిడి దిగుబడి అంచనాలను పరిశీలించి, రైతులకు తగిన మద్దతు ధర అందించేందుకు చర్యలు తీసుకోవాలని ప్రాసెసింగ్ ఇండస్ట్రీస్ ప్రతినిధులను కోరారు. రైతులు తమ పంటను పూర్తిగా పక్వానికి వచ్చిన తరువాత మాత్రమే కోయాలని, అదేవిధంగా ఒకేసారి కోతకు దిగకుండా దశల వారీగా పంట కోయడం ద్వారా మార్కెట్‌లో స్థిరత్వాన్ని సాధించి, లాభదాయకతను పెంచుకోవాలని సూచించారు. ప్రభుత్వం ఈ అంశాన్ని సమగ్రంగా పరిశీలించి, రైతుల ప్రయోజనాన్ని దృష్టిలో ఉంచుకుని తగిన నిర్ణయాలు తీసుకుంటోందని అన్నారు.

రైతులు, ఫ్యాక్టరీ యజమానులు ఎవరు నష్టపోకుండా ఉండేలా స్థిరత్వం కలిగిన ధరలు నిర్ణయించాలని రైతు నాయకులు, ఫ్యాక్టరీ యజమానులు జిల్లా కలెక్టర్ ను కోరగా కలెక్టర్ స్పందిస్తూ జిల్లాలో రైతులు నష్టపోకుండా మధ్యవర్తులు ఎవరూ లేకుండా ఇటు ఫ్యాక్టరీ యజమానులు మామిడి రైతులు ఇరువురు నష్టపోకుండా గిట్టు బాటు ధర కల్పించే దిశగా ప్రభుత్వం యోచిస్తోందని, అందుకు జిల్లాలోని అధికారులు అందరూ ఆ దిశగా చర్యలు తీసుకోవాలని సూచించారు.

పక్క రాష్ట్రాల నుంచి మామిడిపళ్ళను దిగుమతి చేసుకోవడం ద్వారా జిల్లాలోని మేము తీవ్రంగా నష్టపోతున్నామని దీనిపై తగిన చర్యలు తీసుకోవాలని అలాగే ఉమ్మడి చిత్తూరు తిరుపతి, అన్నమయ్య జల్లాలకు సంబందించిన మామిడి రైతులు, రైతు సంఘ నాయకులు, ఫ్యాక్టరీ యజమానులతో మరొక సమావేశం నిర్వహించాలని వారు కోరారు అందుకు కలెక్టర్ సానుకూలంగా స్పందింఛి త్వరలో మరొక సమావేశం ఏర్పాటు చేస్తామని అన్నారు.

ఈ సమావేశంలో ఉద్యానశాఖాధికాదికారి దశరథ రామి రెడ్డి, సూక్ష్మ నీటి పారుదల అధికారి, మండల ఉద్యాన అధికారులు, ఫుడ్ మరియు పల్ప్ ప్రాసెసింగ్ పరిశ్రమ అధికారులు, రైతు ఉత్పత్తిదారు సంఘాల సమాఖ్య, మరియు రైతులు, తదితరులు పాల్గొన్నారు.

## భారత్ భద్రతా త్రివిధ దళాలకు ఆధ్యాత్మిక సంఘీభావం తెలుపుదాం

- ఏపీ డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ పిలుపు
- భారత సైనిక బలగాలకు మరోసారి ధన్యవాదాలన్న పవన్ కళ్యాణ్



అమరావతి ( జర్నలిస్ట్ ఫైల్ ) : ఉగ్రవాదాన్ని అంతం చేయాలనే లక్ష్యంతో పనిచేస్తున్న భారతదేశానికి, మన రక్షణ బలగాల రక్షణ కోసం పూజలు చేస్తున్నట్లు.. వారికి మనతరఫున ఆధ్యాత్మిక సంఘీభావం తెలుపడం అవసరమని ఏపీ డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ తెలిపారు. ఆపరేషన్ సిందూర్ తో భారత బలగాలు తిరుగులేని ధైర్య సాహసాలు ప్రదర్శించాయన్నారు. జమ్మూకశ్మీర్‌లోని పహల్గాంలో జరిగిన ఉగ్రవాదుల దాడి యావత్ దేశాన్ని కదిలించిందన్నారు. జాతీయ భద్రత కోసం జనసేన ఆధ్వర్యంలో సర్వమత ప్రార్థనలు చేస్తున్నామని అన్నారు. ఈ మేరకు సోషల్ మీడియా మాధ్యమం 'ఎక్స్' వేదికగా పవన్ కళ్యాణ్ శుక్రవారం ట్వీట్ చేశారు. ఇలాంటి సమయంలో ఆపరేషన్ సిందూర్ ద్వారా పాకిస్థాన్, పాక్ ఆక్రమిత కశ్మీర్‌లోని ఉగ్రవాద మూలాలపై, వారికి సహకరిస్తున్న పాకిస్థాన్ ఆర్మీపై దాడులు చేసి ఉగ్రమూకలను అంతం చేసి తిరుగులేని ధైర్య సాహసాలను భారత బలగాలు ప్రదర్శించాయని పవన్ కళ్యాణ్ చెప్పారు. భారత్‌కు రక్షణ కవచంలా నిలిచిన మన భద్రతా దళాలకు మనస్ఫూర్తిగా ధన్యవాదాలు తెలియజేస్తున్నానని అన్నారు.

తమిళనాడులోని దేవసేనాని సుబ్రహ్మణ్య స్వామి వారి 6 షష్ఠ షణ్ముఖ ఆలయాల్లో, కర్ణాటక, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల్లోని 4 సుబ్రహ్మణ్య స్వామి ఆలయాల్లో, ఇంద్రకీలాద్రి దుర్గమ్మ వారి ఆలయంలో, అరసవల్లి శ్రీ సూర్యనారాయణ స్వామి ఆలయంలో, ఇతర ఆలయాలు, మసీదుల్లో, చర్చిల్లో సర్వమత ప్రార్థనలు చేస్తున్నామని వెల్లడించారు. ఈ క్రమంలో జనసేన నేతలకు, జనసైనికులను మనస్ఫూర్తిగా ధన్యవాదాలు తెలిపారు. మతాలకు అతీతంగా ఈ సర్వమత ప్రార్థనల్లో పాల్గొన్న నాయకులకు ప్రత్యేక ధన్యవాదాలు చెప్పారు. భారత సార్వభౌమాధికారాన్ని కాపాడుకునేందుకు, ఉగ్రవాదాన్ని తుద ముట్టించేందుకు ప్రతి ఒక్కరూ సమష్టిగా, బలంగా నిలబడుదాం, భారత దేశపు ఐక్యతను చాటి చెబుదామని పవన్ కళ్యాణ్ పిలుపునిచ్చారు.

## గుంటూరు ఛానల్ పనులు త్వరగా ప్రారంభించాలి

- విస్తరణ, భూసేకరణకు నిధులు విడుదల చేసిన ప్రభుత్వం
- భూసేకరణ సర్వే బాధ్యత కాంట్రాక్ట్ సంస్థ చేపట్టాలి
- జల వనరుల శాఖ అధికారుల సమావేశంలో పెమ్మసాని



గుంటూరు ( జర్నలిస్ట్ ఫైల్ ) : గుంటూరు ఛానల్ విస్తరణ పనులను త్వరగా ప్రారంభించాలి. అలాగే పూసేకరణ సర్వే పనులతో పాటు త్వరితగతన పనులను ప్రారంభించాలి." అని గ్రామీణ అభివృద్ధి, కమ్యూనికేషన్స్ శాఖ కేంద్ర సహాయ మంత్రి డాక్టర్ పెమ్మసాని చంద్రశేఖర్ మాట్లాడారు.

గుంటూరు ఛానల్ అభివృద్ధి పనులలో భాగంగా ప్రభుత్వం విడుదల చేసిన నిధులకు తగ్గట్టుగా పనులు ప్రారంభించాలని సూచిస్తూ పెమ్మసాని తన క్యాంప్ కార్యాలయంలో ఇరిగేషన్ అధికారులతో శుక్రవారం ప్రత్యేక సమావేశమయ్యారు.

గుంటూరు, పల్నాడు ప్రాంతాలకు ఉపయోగపడేలా గుంటూరు ఛానల్ విస్తరణ అభివృద్ధి పనుల నిమిత్తం కేంద్రమంత్రి పెమ్మసాని చొరవతో 2025 – 26 బడ్జెట్లో భాగంగా రాష్ట్ర ప్రభుత్వం విస్తరణ, భూసేకరణకు కలిపి రూ. 400 కోట్లను నిధులను మంజూరు చేసింది. అందులో భాగంగా భూసేకరణకు రూ. 75 కోట్లను, విస్తరణకు రూ. 96 కోట్లను నాలుగు విడతలుగా విడుదల చేస్తూ ప్రభుత్వం తాజాగా నిర్ణయం ప్రకటించింది. కాగా ప్రభుత్వం విడుదల చేసిన నిధులతో త్వరితగతిన విస్తరణ భూసేకరణ పనులను త్వరగా ప్రారంభించాలని పెమ్మసాని అధికారులకు స్పష్టం చేశారు. అలాగే భూసేకరణలో భాగంగా నాలుగు గ్రామాల్లో నిర్వహించాలని సర్వే పనులను కాంట్రాక్టు సంస్థ చేపట్టాలని అధికారులకు ఆయన తెలియజేశారు ప్రభుత్వానికి అందించాల్సిన ప్రతిపాదనలు త్వరితగతిన పంపాలని, అభివృద్ధి పనులపై వ్యక్తిగత శ్రద్ధ తీసుకుని అధికారులు పనిచేయాలని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో ఇరిగేషన్ శాఖ చీఫ్ ఇంజనీర్ రాంబాబు, సూపర్ ఇండియన్ వెంకటరత్నం తదితరులు పాల్గొన్నారు.

## శ్రీవారికి బంగారు కఠి, వరద హస్తాలు విరాళం



తిరుమల ( జర్నలిస్ట్ ఫైల్ ) : తిరుమల శ్రీవేంకటేశ్వరస్వామివారికి శుక్రవారం ఉదయం భారీ బంగారు కానుక విరాళంగా అందింది. కలకత్తాకు చెందిన సంజీవ్ గోయెంకా రూ.3.63కోట్లువిలువైన 5.267 కేజీల బంగారంతో వజ్రాలు, రత్నాలతో పొదిగిన కఠి, వరద హస్తాలను చేయించి స్వామివారికి సమర్పించారు.

ఈ మేరకు తిరుమలలోని రంగనాయకుల మండపంలో టీటీడీ అదనపు ఈవో సి.హెచ్.వెంకయ్య చౌదరికి ఆభరణాలను అందజేశారు. ఈ కార్యక్రమంలో శ్రీవారి ఆలయ డిప్యూటీ ఈవో లోకనాథం, బొక్కసం ఇన్ ఛార్జి గురురాజ స్వామి, ఇతర అధికారులు పాల్గొన్నారు.

## రైతుకు తోడు... జగన్‌కు తేడా తెలీదు

- ధరలపై అసత్య ప్రచారం - అచ్చెన్న మండిపాటు



అమరావతి ( జర్నలిస్ట్ ఫైల్ ) : ఉల్లి గడ్డకీ, ఆలుగడ్డకీ తేడా తెలియని జగన్‌రెడ్డి రైతుల ధరల గురించి మాట్లాడడం విచిత్రమని వ్యవసాయ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు విమర్శించారు. రాష్ట్రంలో పంటలకు గిట్టుబాటు ధరలు లేకపోతున్నట్లు తప్పుడు ప్రచారం చేయడం జగన్ కుట్రల భాగమేనన్నారు.

రైతు సమస్యలపై జగన్ తప్పుడు వాఖ్యలు చేయడాన్ని ఖండించిన ఆయన "రైతన్న ఎండకైనా, వానకైనా వెనకాడడు. కానీ జగన్ మాత్రం బెంగళూరు ప్యాలెస్‌లో కూర్చొని అసత్య ప్రచారాలకు పాల్పడుతున్నాడు" అని ఆగ్రహం వ్యక్తం చేశారు.

**పొగాకు రైతులకు భరోసా**

జాతీయ, అంతర్జాతీయ మార్కెట్లలో ధరలు తగ్గినా, హెచ్ డీ బార్లీ పొగాకు క్వింటా రూ.12,500కు కొనుగోలు చేయాలని రాష్ట్ర ప్రభుత్వం ఆదేశాలు జారీచేసిందన్నారు. జీపీఐ, ఐటీసీ సంస్థలు ఇప్పటికే 20 మిలియన్ కిలోల కొనుగోలను ప్రారంభించాయని పేర్కొన్నారు. రైతుల సహాయార్థం ప్రత్యేక కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేసి, వాట్సాప్ సమూహాల ద్వారా రోజూ సమీక్షలు చేస్తామని చెప్పారు.

**కాకోకు కనీస ధర**

కాకో గింజలకు కిలో రూ.500 ధర నిర్ణయించి, అన్ని మాండలీలకు ఆదేశాలు ఇచ్చినట్టు తెలిపారు. ఆయిల్ పామ్ మాదిరిగానే కాకోకు కూడా ప్రత్యేక ధరల విధానం తీసుకువచ్చేలా చర్యలు తీసుకుంటున్నట్టు చెప్పారు.

**మిరప రైతుకు కాపాడే కవచం**

మిరప రైతులు విక్రయించిన ఉత్పత్తులపై నష్టాల విశ్లేషణ చేసి, నేరుగా ప్రభుత్వ సహాయం అందించేందుకు ముఖ్యమంత్రి ఆదేశించారని పేర్కొన్నారు. ఇందులో మధ్యవర్తులకు చోటు లేకుండా చర్యలు చేపట్టామన్నారు.

**అసత్య ప్రచారాల వెనక...**

తాడేపల్లి ప్యాలెస్‌లోని మద్యం కుంభకోణంపై ఆరోపణల దృష్టిని మళ్లించేందుకు జగన్ ఈ రకమైన రాజకీయాలకు పాల్పడుతున్నారని విమర్శించారు. రైతుల పేరుతో రాజకీయ లబ్ధి పొందాలని జగన్ చేస్తున్న యత్నాలు ఫలించవని హెచ్చరించారు.

"రైతన్నలతో ప్రభుత్వమే తోడు. రైతుకు మేలు చేసేలా ప్రతి రంగంలోనూ ప్రణాళికాబద్ధంగా ముందుకెళ్తున్నాం" అని మంత్రి అచ్చెన్న స్పష్టం చేశారు.

## గుంటూరులో 60 లక్షల విలువైన సెల్‌ఫోన్లు రికవరీ

- ఇప్పటి వరకు జిల్లాలో రూ. 5.8 కోట్ల విలువైన 2,900 ఫోన్లను రికవరీ
- సైబర్ నేరాలకు చెక్‌పెట్టిన పోలీసులు




గుంటూరు ( జర్నలిస్ట్ ఫైల్ ) : జిల్లాలో సైబర్ నేరాలపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని గుంటూరు జిల్లా ఎస్పీ సతీష్ కుమార్ తెలిపారు. సెల్‌ఫోన్ల ద్వారా జరిగే మోసాలపై అవగాహన కలిగించడమే లక్ష్యంగా శుక్రవారం పోలీస్ కార్యాలయంలో ప్రత్యేక కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా దొంగిలించబడ్డ మరియు పోగొట్టుకున్న 300 మొబైల్ ఫోన్లను బాధితులకు అందజేశారు. వీటి విలువ సుమారు రూ. 60 లక్షలుగా ఉంది. ఇప్పటి వరకు జిల్లాలో రూ. 5.8 కోట్ల విలువైన 2,900 ఫోన్లను రికవరీ చేసినట్టు తెలిపారు.

ఫోన్ పోయిన వెంటనే 1930 నంబరుకు లేదా సీఈఐఆర్ వెబ్‌సైట్ ద్వారా ఫిర్యాదు చేయాలని సూచించారు. నేటి రోజుల్లో మొబైల్‌ఫోన్లు వ్యక్తిగత, బ్యాంకు, గోప్యమైన సమాచారాన్ని కలిగి ఉండటంతో అవి తప్పిపోయినప్పుడు వెంటనే స్పందించాల్సిన అవసరం ఉందన్నారు. ప్రజలు పోలీసులకు ఫిర్యాదు చేస్తే ఎటువంటి రుసుము లేకుండా మొబైళ్లను తిరిగి పొందేలా చర్యలు తీసుకుంటామని తెలిపారు. సైబర్ నేరగాళ్లు తరచుగా అధిక వడ్డీ, ఉద్యోగం, వ్యాపారం పేరుతో మోసాలకు పాల్పడుతున్న నేపథ్యంలో అందుకు అనుగుణంగా ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. అనుమానాస్పద ఫోన్ కాల్స్ వస్తే వాటిని బ్లాక్ చేసి పోలీసులకు సమాచారం ఇవ్వాలని తెలిపారు. ప్రయాణాల సందర్భంలో ప్రజలు ఎల్.హెచ్.ఎం.ఎస్ సేవను వినియోగించుకోవాలని, ఇంటి వద్ద సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. ద్విచక్ర వాహనాలకు వీల్ లాక్‌లు, GPS ట్రాకింగ్ వ్యవస్థలు అమర్చుకోవాలని సూచిస్తూ వాహన దొంగతనాలు ఎదుర్కొనే అవకాశం తగ్గుతుందని తెలిపారు.

ఫోన్‌ల రికవరీలో కృషి చేసిన ఐటీ కోర్ సీఐ నిస్సార్ బాషా, హెడ్ కానిస్టేబుల్ కిషోర్, కానిస్టేబుళ్ల శ్రీధర్, మానస, సీసీఏఎస్ హెడ్ కానిస్టేబుల్ రమేష్, కానిస్టేబుల్ కరీముల్లాను ఈ సందర్భంగా అభినందించారు. కార్యక్రమంలో అదనపు ఎస్పీ హనుమంతు, ఎస్పీ సీఐ శ్రీనివాస్, ఐటీ కోర్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## మాకు బదలీలు, పదోన్నతులు ఇవ్వండి

- పురపాలక టీచర్ల వినతితో విద్యాశాఖ మంత్రికి వినతిపత్రం

అమరావతి ( జర్నలిస్ట్ ఫైల్ ) : పిల్లలు ఎక్కడ ఉంటే అక్కడ కనీసం ఒక్కో తరగతికి ఒక్కో టీచర్ ఉండాలన్న ప్రభుత్వ లక్ష్యాన్ని పురపాలక టీచర్లు హర్షిస్తున్నారు. అదే సమయంలో, తగిన బదిలీలు, పదోన్నతులు కల్పించి తమకు న్యాయం చేయాలని కోరుతున్నారు. ఈ మేరకు పురపాలక టీచర్స్ ఫెడరేషన్ రాష్ట్ర అధ్యక్షుడు యస్. రామకృష్ణ గౌరవ విద్యాశాఖ మంత్రికి వినతిపత్రం సమర్పించారు.

ప్రస్తుతం రాష్ట్రంలోని గ్రామీణ ప్రాంతాల్లో కొన్ని హైస్కూల్‌ల్లో విద్యార్థుల సంఖ్య 70 మందికి లోపే ఉండగా, ప్రాథమిక పాఠశాలల్లో 10 మందికి లోపు విద్యార్థులు ఉన్న స్కూళ్లు ఎన్నో ఉన్నాయి. అయినప్పటికీ అక్కడ టీచర్ పోస్టుల కోసం గుర్తింపు సంఘాలు పోరాడుతున్నాయని, ఇది అన్యాయమని పురపాలక టీచర్లు అభిప్రాయపడుతున్నారు. మరోవైపు, పురపాలక ప్రాంతాల్లో విద్యార్థుల సంఖ్య అధికంగా ఉన్నా, తగిన సంఖ్యలో టీచర్లు లేక విద్యార్థులకు నాణ్యమైన బోధన అందడం లేదు. ఉదాహరణకు, ఓ హైస్కూల్లో 600 మంది విద్యార్థులకు కేవలం 5 మంది టీచర్లు, 100 మంది విద్యార్థులున్న ప్రాథమిక పాఠశాలలో కేవలం 2 టీచర్లే పనిచేస్తున్నారు.

ఇలాంటి పరిస్థితుల్లో విద్యా చట్టానికి అనుగుణంగా తగిన టీచర్ పోస్టులు మంజూరు చేయాలని పురపాలక టీచర్ల సంఘం డిమాండ్ చేస్తోంది. ప్రభుత్వ కూటమి తీసుకున్న విద్యా విధానం తనకు ఆదర్శంగా ఉందని పేర్కొంటూ, తాము ప్రభుత్వ లక్ష్యాలకు అనుకూలంగా పనిచేసేందుకు సిద్ధంగా ఉన్నామని వివరించారు.

విద్యా రంగంలో అవినీతి, అక్రమాల నిర్మూలన లక్ష్యంగా 7 గుర్తింపు సంఘాలు పని చేస్తున్నాయని, అవసరమైతే టీచర్ల సంఘాల ఎన్నికలను హాజరు యాప్ ద్వారా ట్రయల్ ఆధారంగా నిర్వహించాలని సూచించారు. అలాగే జిల్లా స్థాయి విద్యాధికారుల అధికారాన్ని వికేంద్రీకరించి, కస్లర్ ప్రాతిపదికన నిష్పక్షపాత పరిపాలన జరగాలన్నది తమ అభిమతమన్నారు. తుదకు, అన్ని యూజమాన్యాలకు సమ న్యాయం కల్పించేలా ప్రభుత్వం ముందడుగు వేయాలని కోరుతూ, తమకు బదిలీలు, పదోన్నతులు ఇవ్వాలని, తగిన నిబంధనలు అమలు చేయాలని వారు విజ్ఞప్తి చేశారు.

## భారతదేశం సత్తాను ప్రపంచానికి చాటిన ఆపరేషన్ సిందూర్: చీఫ్ విప్ జీవీ




- తిరంగా ర్యాలీలో పాల్గొన్న చీఫ్ విప్ జీవీ, జీడీసీసీబీ ఛైర్మన్ మక్కెన

వినుకొండ (జర్నలిస్ట్ ఫైల్ ): పహెల్గాం ఉగ్రదాడికి ప్రతీకారంగా సైనిక బలగాలు చేపట్టిన ఆపరేషన్ సిందూర్ భారతదేశం సత్తా ను ప్రపంచానికి చాటి చెప్పిందన్నారు ప్రభుత్వ చీఫ్‌విప్, వినుకొండ ఎమ్మెల్యే జీవీ ఆంజనేయులు. భారత సైనిక శక్తి, సంకల్పానికి నిదర్శనంగా నిలిచిన ఆపరేషన్‌లో సైన్యం ధైర్యసాహసాలు, లక్ష్యాల్ని తుత్తునియలు చేసిన సాంకేతికతలపై అంతా ఆశ్చర్యపోయి చూస్తున్నారన్నారు. కశ్మీ ర్‌లో అమాయకులను బలితీసుకున్న ఉగ్రవాదులకు తగిన గుణపాఠం చెప్పిన ప్రధాని మోదీ, ఆపరేషన్ సిందూర్ విజయవంతం చేసిన త్రివిధ దళాలకు ధన్యవాదాలు తెలుపుతున్నామని అన్నారు. ఈ మేరకు సైనికులను అభినందిస్తూ శుక్రవారం వినుకొండలో భారీగా తిరంగా ర్యాలీ నిర్వహించారు. జాతీయ సమైక్యత, సమగ్రతను చాటేలా గీతాలు ఆలపించారు. భారత్ మాతాకీ జై, జైహింద్, వందేమాతరం వంటి నినాదాలు అంతటా మార్మోగాయి. ఈ సందర్భంగా మాట్లాడి న చీఫ్‌విప్ జీవీ ఆంజనేయులు శత్రుదేశంపై ప్రాణాలు లెక్కచేయకుండా పోరాడిన వీరజవాన్లకు సెల్యూట్ చేస్తున్నామన్నారు. ఈ పోరాటంలో అమరుడైన వీరజవాన్ మురళీనాయక్‌కు జోహార్లు అర్పిస్తున్నామన్నారు. మురళీనాయక్ కుటుంబానికి సీఎం చంద్రబాబు, ప్రభుత్వం కూడా అండగా నిలబడిందని, రూ. 50 లక్షల నగదుతో పాటు 5 ఎకరాల భూమి ప్రకటించారన్నారు. సీఎం చంద్రబాబు, ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్ ఆపరేషన్ సిందూర్‌కు సంపూర్ణ మద్దతు ప్రకటించి దేశానికి అండగా నిలబడ్డారన్నారు. 145 కోట్ల మంది భారత జాతి.. హిందూ, ముస్లిం, క్రిస్టియన్, మైనార్టీలు కుల, మతాలకు అతీతంగా తామంతా ఒక్కటేనని సమైక్యతను చాటి చెప్పారన్నారు. ఈ తిరంగా యాత్ర జాతీయ ఐక్యత చిహ్నమని, అన్నివర్గాల ప్రజల్ని ఒక్కతాటి పైకి తెచ్చి, సైన్యానికి గౌరవ వందనం, దేశభక్తిని బలోపేతం చేసే ప్రయత్నమని చెప్పారు. ఇకపై ఉగ్రవాదులు దేశంవైపు కన్నెత్తి చూడాలంటే భయపడేలా ఆపరేషన్ సిందూర్ నిర్వహించారని, ఈ పోరాటం భవిష్యత్తులో కూడా కొనసాగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో ప్రభుత్వ చీఫ్ విప్ జీవీ ఆంజనేయులతో పాటు జీడీసీసీబీ ఛైర్మన్ మక్కెన మల్లికార్జునరావు, విద్యార్థులు, యువత, కూటమి నాయకులు భారీ సంఖ్యలో పాల్గొన్నారు. వినుకొండ మున్సిపల్ కార్యాలయం నుంచి ప్రారంభమైన ప్రదర్శన శివయ్య స్తూపం, కారంపూడి రోడ్డు, సురేష్ మహల్ రోడ్డు మీదుగా సాగింది.

## టిటిడి వేద పాఠశాలల్లో ప్రవేశాల దరఖాస్తులకు ఆహ్వానం



తిరుపతి ( జర్నలిస్ట్ ఫైల్ ) : టిటిడి వేద పాఠశాలలో ప్రవేశాలకు 2025 – 26 విద్యాసంవత్సరానికి గాను అర్హులైన విద్యార్థుల నుండి దరఖాస్తులను ఆహ్వానించడమైనది. టిటిడి ఆధ్వర్యంలో నడపబడుచున్న శ్రీ వేంకటేశ్వర వేద విజ్ఞాన పీఠములు (పాఠశాలలు) 1. వేద విజ్ఞాన పీఠం, ధర్మగిరి, తిరుమల 2. కీసరగుట్ట, 3. విజయనగరం, 4. ఐ. భీమవరం, 5. నల్గొండ, 6. కోటప్పకొండ నందు బోధింపబడు వివిధ కోర్సుల్లో ప్రవేశం కొరకు అర్హులైన బాలుర నుండి అనగా వైదిక సంప్రదాయం ప్రకారం ఉపనయనం కాబడి మరియు నిర్ణీత వయస్సు, విద్యా ప్రమాణాలు కలిగిన వారి నుండి దరఖాస్తులు కోరబడుచున్నవి. సదరు పాఠశాలల యందు బోధింపబడు వివిధ కోర్సుల వివరాలు, అర్హత, ఆవశ్యకత, దరఖాస్తు మరియు ఇతర వివరాలకు టిటిడి వెబ్ సైట్ www.tirumala.org నందు తిలకించవచ్చును. 2025 మే 30వ తేదీలోపు దరఖాస్తు చేసుకోవాల్సి ఉంటుంది.

Edited, Printed and Published by D.Ajay at Express Printers and Publishers D.No. 3-28-1, Brundavan Gardens, Guntur (A.P)-522006. RNI No. 52813/1993.
Administration Office : 126-352, Between 4th & 5th lanes , Kodandarama Nagar, Gorlavaripalem Donka, Gorantla, Guntur (AP)-522034. Ph 8106539118, 7416812467